తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
29 జూలై 2026
పేజీలు : 8
Follow :



# గురుపౌర్ణమి పర్వదినాన కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ

❍ నేడు ఉదయం 5 గంటలకు ప్రారంభం
రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం
కొండగట్టు గిరి ప్రదక్షిణ:
❍ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు..
❍ చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం..

**కరీంనగర్ బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :**
నేడు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అట్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని సకల జనుల సంక్షేమం కోసం చేస్తున్న ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా భక్తులందరూ పాల్గొనాలని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... ఆధ్యాత్మిక క్షేత్రం తో పాటు పచ్చని ప్రకృతి కొండగట్టు ప్రత్యేకత, ఈ రాష్ట్రంలో ప్రజలు బాగుండాలి వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులందరూ సుభిక్షంగా ఉండాలని నేడు గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఇది కేవలం ఒక పార్టీ కో, ఒక వర్గానికో, ఒక మతానికో సంబంధించిన కార్యక్రమం కాదు ముఖ్యంగా ఎల్ నీనో ప్రభావంతో రైతుల ఇబ్బందులు తొలిగిపోవాలని సకలజనుల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమమని, కొండగట్టు అంజన్న దర్శనానికి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్గడ్ రాష్ట్రాలను ఎంతోమంది భక్తులు దర్శనానికి వస్తారు. అటు నరసింహమూర్తి ఇటు శివుని రెండు రూపాల కలయికతో దేశంలో ఎక్కడా లేనివిధంగా కొండగట్టు ఆంజనేయ స్వామి ప్రతిరూపం ఉంటుందని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అనేక దేవాలయాలలో అభివృద్ధి కొనసాగుతుంది.

మిగతా 11లో

## కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఘనంగా ప్రారంభమైన 'వన మహోత్సవం'

### నగరాన్ని 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' గా తీర్చిదిద్దడమే లక్ష్యం..
### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..



**కరీంనగర్ బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో చేపట్టిన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని 53వ డివిజన్ సాయి నగర్‌లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. నగరాన్ని కేవలం 'క్లీన్ సిటీ' గానే కాకుండా క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నగర మేయర్ తెలిపారు. వన మహోత్సవం ప్రారంభోత్సవంలో భాగంగా సాయి నగర్‌లో ఒకే రోజు సుమారు 500 మొక్కలను నాటారు. నగరవ్యాప్తంగా ప్రతి ఇంటికి రెండు చొప్పున పూల లేదా పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని గృహాలకు 3 లక్షల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు, వివిధ డివిజన్లలో సుమారు లక్ష మొక్కలను నాటే లక్ష్యాన్ని నగరపాలక సంస్థ నిర్దేశించుకుంది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న అనుకూల సమయంలో మొక్కలు నాటితే అవి సులభంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ, కరీంనగర్‌ను 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' గా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంపెల్లి శ్వేత రమన్, వంగల పవన్ కుమార్, కాలనీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మహిళలు , స్థానికులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అవయవాలు దెబ్బతిన్న వారికి అపరసంజీవని సీఆర్‌ఆర్‌టీ

### కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి

**కరీంనగర్ బ్యూరో, జూలై 28 ( జనంసాక్షి) :**
అవయవాలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ (సీఆర్‌ఆర్‌టీ) అపర సంజీవనిలా పనిచేస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో సీఆర్‌ఆర్‌టీ యంత్రం పనితీరు, దాని ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్నప్పుడు సీఆర్‌ఆర్‌టీ ఎంతో కీలకంగా ఉలపయోగపడుతుందని వివరించారు. బీపీని మెయింటెన్ చేసే మందులతో 24 గంటలు డయాలసిస్ చేస్తూ ప్రాణాపాయం నుంచి కాపాడే మిషనే సీఆర్‌ఆర్‌టీ అని తెలిపారు. సాదారణ డయాలసిస్‌ను తట్టుకోలేని రోగులకు ఈ అత్యాధునిక చికిత్స విధానం నిరంతరాయంగా రక్తాన్ని శుద్ధి చేస్తూ శరీరంలోని వ్యర్థాలు, అదనపు ద్రవాలను తొలగిస్తుందని తెలిపారు. దీంతో గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలపై ఒత్తిడి తగ్గి కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సీఆర్‌ఆర్‌టీ యంత్రం పనితీరు, చికిత్స విధానం, రోగులకు



కలిగే ప్రయోజనాలను వైద్యులు వివరించారు. మెడికవర్ ఆసుపత్రిలో సీఆర్‌ఆర్‌టీ యంత్రాన్ని సమర్థవంతంగా వినియోగించి పలువురు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను టీం వర్క్‌తో కాపాడగలిగామని వైద్యులు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి సరైన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, ఈ సాంకేతికత ప్రాణరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మనోజ్, వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## వీణవంక పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ : హుజురాబాద్ ఏసీపీ మాధవి

**వీణవంక జులై 28 (జనం సాక్షి)**
వీణవంక పోలీస్ స్టేషన్‌లో హుజురాబాద్ ఏసిపి వి.మాధవి వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేరాల రికార్డులు,కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు,మాల్ఖానా, శాంతిభద్రతల పరిస్థితి,ప్రజలకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎస్ఐ ఆవుల తిరుపతి కి పలు సూచనలు చేశారు.తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని హుజురాబాద్ ఏసీపీ మాధవి పేర్కొన్నారు.హుజురాబాద్ ఏసిపి మాధవి మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు సహకరిస్తే శాంతి భద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్,వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి,ఏఎస్ఐ వెంకట్ రెడ్డి,హెడ్ మోహన్,అశోక్, కొమురయ్య,తోపాటు పోలీసు సిబ్బంది,పాల్గొన్నారు.



# భూభారతి రీ-సర్వేను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

- పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచన
- భూ సమస్యల పరిష్కారానికి రీ-సర్వే దోహదం



**చొప్పదండి, జూలై 28 (జనం సాక్షి):**మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో జరుగుతున్న భూభారతి రీ-సర్వేను ట్రైనీ కలెక్టర్ టి. హరిప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరుపై తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.భూ సంబంధిత సమస్యలు తగ్గడంతో పాటు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వివాదాలకు పరిష్కారం లభించేలా ప్రభుత్వం చేపట్టిన ఈ రీ-సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేణుగోపాల్, సర్వేయర్ శ్రీనివాస్, గిర్దావర్ టి. త్రిపాల్‌సింగ్, జీపీవోలు వీరేందర్, మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేయాలి

- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు
- రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 28 (జనం సాక్షి):**ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాకలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్నాయని తెలిపారు. జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 36 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వేములవాడ అర్బన్ మండలంలో భూగర్భ జలాలు 20 మీటర్ల లోతుకు వెళ్లాయని పేర్కొన్నారు.జిల్లాలోని ఎగువ మానేరు, శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు), మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటి అవసరాలకు సరిపోతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దని, మార్కెట్ డిమాండ్‌తో పాటు నేలకు అనుకూలమైన పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు.సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని ప్రారంభించారని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే మూడు సంవత్సరాల తర్వాత దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, నువ్వులు, మొక్కజొన్న వంటి పంటలను ఇప్పటికీ సాగు చేయవచ్చని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ జలసిరి పథకం కింద బోర్‌వెల్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్ల నిర్మాణాలు, ఇతర జల సంరక్షణ పనులను ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టాలని పిలుపునిచ్చారు. వర్షాకాలంలో నీటిని సంరక్షిస్తే రానున్న రబీ సీజన్‌లో ఇబ్బందులు ఎదురుకావని తెలిపారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, నీటిని వేడి చేసి చల్లారిన తర్వాత తాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ డివిజన్ ఆత్మ కమిటీ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయికుమార్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్‌కుమార్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సర్పంచ్ మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

# వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలి




**గంగాధర, జూలై 28 (జనం సాక్షి):**కన్నెపల్లి పంపులను ప్రారంభించి మిడ్‌మానేరు, వరద కాలువలోకి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు.మంగళవారం మధురానగర్ ఎక్స్‌రోడ్డు చౌరస్తాలో కరీంనగర్--జగిత్యాల ప్రధాన రహదారిపై రైతులతో కలిసి సుంకే రవిశంకర్ బైఠాయించి వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నెపల్లిలోని పంపులను ప్రారంభించి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏడాదంతా నీటితో కళకళలాడిన వరద కాలువ ప్రస్తుతం ఎండిపోయి ఎడారిలా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరువు పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు.వరద కాలువపై ఆధారపడి సుమారు 70 కిలోమీటర్ల పరిధిలో రైతులు సాగు చేసేవారని, ప్రస్తుతం కాలువలో నీరు లేకపోవడంతో నాట్లు వేయలేక పొలాలు బీడుగా మారాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతాంగాన్ని మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ, రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే వరద కాలువలోకి నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.రాబోయే 11 రోజుల్లో కన్నెపల్లిలోని పంపులను ప్రారంభించి వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో మూడు జిల్లాల కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగి శేఖర్, నవీన్‌రావు, విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, రామిడి సురేందర్, ఎండీ నజీర్ హుస్సేన్, మడ్లపెల్లి గంగాధర్, జోగు సాగర్, శ్రీమల్ల మెగరాజ్, కరభూజ తిరుపతి గౌడ్, మామిడి అఖిల్, కొంకటి శేఖర్, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, అక్కెనపెల్లి కరుణాకర్, పూదూరి మల్లేశం, మడ్లపెల్లి రమేష్, సముద్రాల అజయ్, దోమకొండ మల్లన్న, గడ్డం స్వామితో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ రాములు



**ఇబ్రహీంపట్నం, జులై 27 (జనం సాక్షి):** వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్పల్లి డీఎస్పీ ఏ.రాములు సోమవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్‌లోని పలు రికార్డులు, సీజ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు.ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచి వారి వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మెట్పల్లి సీఐ బి.సురేష్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్‌కుమార్, మల్లాపూర్ ఎస్సై ఏ.అనిల్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు గురుపౌర్ణమి వేడుకలు



**హుజూరాబాద్, జులై 28 ( జనం సాక్షి) :**గురు పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని శ్రీగణపతి దత్తాత్రేయ సహిత షిరిడీ సాయిబాబా మందిరంలో వేడుకలు నిర్వహించనున్నారు. బాబా ఆలయంలో ఉదయం విశేష పూజలు, అభిషేకాలు, కలుష పూజ, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వెంపటి సదానందం, అర్చకులు వరుణ్ అయ్యగార్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కలుషపూజ (108 కలుశాల) తో అభిషేకం, మధ్యాహ్నం 12గంటలకు హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కావాలని కోరారు. హారతి అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.


# రైతు వేదికలో విత్తనాల మేళ




**ముత్తారం,జూలై28(జనంసాక్షి):** ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం విత్తనాల మేళను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి అనూష ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై వివిధ రకాల ధృవీకరించిన విత్తనాలను కొనుగోలు చేశారు. వ్యవసాయ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటల సాగు విధానాలు, విత్తే సమయం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సబ్సిడీతో అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులు ఈ విత్తనాల మేళను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

**ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు అవగాహన**




**ముత్తారం, జూలై 28 (జనం సాక్షి):** ముత్తారం మండలం మైదంబండ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వాటి ప్రభావం, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాల పంపిణీలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ పంటల సాగు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించడంతో పాటు నీటి యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు నేస్తం సిబ్బంది, గ్రామాల నుంచి వచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జలసిరి పనులు వేగవంతం చేయాలి



**సిరికొండ, జూలై 28 (జనం సాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామగ్రామాన జలసిరి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలని ప్రత్యేక అధికారి ప్రకాష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, జల సంరక్షణ చర్యలు, ఉపాధి హామీ పనుల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీలలో ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, నీటి సంరక్షణ అవసరం, ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా వీబీజీ రామ్–జీ పథకం కింద ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. ఈ పనుల ద్వారా జాబ్ కార్డు కలిగిన కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించడంతో పాటు భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీలోపు అన్ని గ్రామాల్లో ఈ పనులను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మహమ్మద్ రఫీ అహ్మద్, ఎమ్మార్వో రవీందర్ రావు, ఏపీఎం సురేఖ, వివిధ శాఖల అధికారులు, మండలం లోని ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాపతినిధులు పాల్గొన్నారు.

## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

### సీడీఎంఏ శ్రీదేవిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 28: జనంసాక్షి** ఇందూరు: నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. మంగళవారం సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్ లోని ఆమె కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని కోరారు. ఇందూరు అభివృద్ధి కొరకు నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్ కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు. సానుకూలంగా స్పందించి అన్ని నిధులు మంజూరు చేయించుట కొరకు కృషి చేస్తానని ఆమె తెలిపారన్నారు.



## రాజకీయాలకు అతీతంగా,అభివృద్దే లక్ష్యంగా కలిసి ముందుకు నడవండి



**భీంగల్ టౌన్,జులై 28(జనం సాక్షి)**భీంగల్ నూతన న్యాయస్థాన సాధనకు కృషిచేసిన ప్రజా ప్రతినిధులు,పట్టణ అభివృద్ధి కమిటీ, పత్రిక ప్రముఖులను అభినందించిన డాక్టర్.మధుశేఖర్.భీంగల్ పట్టణానికి నూతన జ్యుడిషియలు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థాన ఏర్పాటుకు కృషిచేసిన గత,ప్రస్తుత సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ,ప్రజా ప్రతినిధులు,పత్రిక ప్రముఖులను డాక్టర్ మధుశేఖర్ ప్రశంశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన న్యాయస్థానం ఏర్పడటం ఈ ప్రాంత బిడ్డగా తనకు గర్వంగా ఉందని,అలాగే చిన్న తగదాలు, ఆక్సిడెంట్ కేసులు,సివిల్ కేసుల విచారణ గురించి మన ప్రాంత,చుట్టు పక్కల మండల ప్రజలకు ప్రయాణించే సమయం,ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మన ప్రాంత విద్యార్థులు కూడా లాయర్లు,జడ్జిలు కావడానికి ప్రేరణ పొందుతారని హర్షభావం వ్యక్తం చేస్తూ, నూతన న్యాయస్థాన ఏర్పాటుకు కృషి చేసిన సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మీరందరు రాజకీయాలకు,పార్టీలకు అతీతంగా, వ్యక్తిగత ద్వేషాలకు దూరంగా మన భీంగల్ ప్రాంత అభివృద్ధికి కష్టపడాలని పట్టణ అభివృద్ధి కమిటీకి,వివిధ రాజకీయ పార్టీ నాయకులకు, వ్యాపారులకు,పత్రిక విలేకరులకు,యువకులకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,ఇదే తన కోరిక అని ఆయన భావాన్ని వ్యక్తంచేశారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి 58 లక్షల నిధులు మంజూరు



**గాంధారి జనంసాక్షి జూలై 28** గాంధారి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం 58 లక్షల నిధులను మంజూరైనట్లు ఎం సి చైర్మన్ బండారు పరమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నిధులు మంజూరు చేసినందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బండారి పరమేశ్వరి మాట్లాడుతూ ఈ నిధులతో మార్కెట్ అభివృద్ధికి వినియోగిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల కోసం కొబ్బరికాయలు కొడుతూ పనుల కు శ్రీకారం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నగర ప్రజల సమస్యలు పరిష్కరించాలని

## మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 28: జనం సాక్షి** నిజామాబాద్ నగరంలో ఉన్న సమస్యల పరిష్కారం గురించి నిజామాబాద్ నగరంలో గల మున్సిపాలిటీ కార్యాలయం ముందు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆద్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి నీలం సాయిబాబా మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను అభివృద్ధి చేయాలి, వినాయక నగర్ బైపాస్ రోడ్డును పూర్తి చేయాలి, పద్మనగర్ రోడ్ నెంబర్ వన్ నుండి వినాయక నగర్ వెళ్తున్న రోడ్డులోని పులాంగ్ బ్రిడ్జి లోయర్ బ్రిడ్జిగా ఉంది ఇది ప్రతి వర్షాకాలం కొట్టుకుపోతోంది అక్కడి నుండి వెళ్తున్న ప్రజలకు ప్రమాదకరంగా మారింది దీన్ని పూలాంగ్ బ్రిడ్జిలగా పర్మినెంట్గా నిర్మించాలి. పూలాంగ్ వాగు చుట్టుప్రక్కల వారు కబ్జా చేస్తున్నారు. కబ్జాలను తొలగించి సిమెంట్ లైనింగ్ లేద పెన్సింగ్ నిర్మించాలి, గత కొన్ని సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పూర్తిగా ప్రజలందరికీ ఉపయోగంలోనికి తీసుకువచ్చే విధంగా బాగుచేయలి,నగర శివారు ప్రాంతాల రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ, మోరీలు, త్రాగునీరు ప్రజలకు అందుబాటులో లేవు వాటిని ఏర్పాటు చేయాలి ప్రమాదాలకు గురవుతున్న నగరంలో ఉన్న ప్రధాన రహదారులు అదేవిధంగా గల్లీలో గల సర్వీస్ రోడ్లు గుంపులుగా ఉండటం మూలంగా ప్రజలకు ప్రమాదానికి గురవుతున్నారు. వెంటనే వీటిని అభివృద్ధి పరచాలి, అదేవిధంగా అన్ని గల్లీలలో డ్రైనేజీ, కలవట్లను, నిర్మాణం చేపట్టాలి ప్రతి గల్లీలో చెత్త కోసం చెత్త వ్యాన్లను, డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలి, నగరంలో ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పార్కులను అభివృద్ధి పరచాలి వీటిని కబ్జాకు గురి కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో పి వై ఎల్ అధ్యక్షులు వనమాల సత్యం, ఐ ఎఫ్ టి యు నగర అధ్యక్షులు డి. మల్లికార్జున్, ఐ ఎఫ్ టి యు నగర కార్యదర్శి శివకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు మోహన్, రాజు, దాసు, వీరయ్య, శంకర్ , ఖలీమ్, సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు

### బీజేపీ జిల్లా అధ్యక్షులు,దినేష్ పటేల్ కులాచారి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 28: జనం సాక్షి** ఇందూరు బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రైవేట్ కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ మిస్ కాల్ ఉద్యమం బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వంశీ గౌడ్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువును కొనసాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అప్పులు చేసి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్య హక్కును కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడం మానుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని యెడల ఇందూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామ్మానరు కావాలి ఈ ప్రభుత్వనికి విద్యార్థుల ఉసురు తగుల్తది అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వంశీ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై బీజేవైఎం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. సంతకాల సేకరణ ద్వారా విద్యార్థుల గళాన్ని ప్రభుత్వానికి వినిపిస్తున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయకపోతే బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మరియు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి భారీ ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కో–కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ, బీజేపీ జిల్లా నాయకులు విపుల్ రావు, రాకేష్, రాజ్ గణేష్, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఓం సింగ్, బీజేవైఎం నాయకులు సాయి ప్రవీణ్తో పాటు పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విత్తన బంతులు



**పిట్లం జూలై 28(జనం సాక్షి)**పిట్లం మండల పరిధిలోనే ప్రపంచ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న కొడపుగల్ విద్యార్థుల సహకారంతో రామేశ్వరం గుట్ట వద్ద 1500 విత్తన బంతులు చల్లినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ప్రమోద్ తెలిపారు. పర్యావరణాన్ని, సహజ వనరులని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తారు. సహజ సంపదను సరైన రీతిలో ఉపయోగిస్తూ భవిష్యత్ తరాల వారికి అందించాల్సిన బాధ్యత మనదే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రెడ్డి కిరణ్ కుమార్, లయన్స్ క్లబ్ కార్యదర్శి మారుతి రెడ్డి, కోశాధికారి బాలు, నారాయణ, లక్ష్మీనారాయణ, కిషన్, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## గుర్తు తెలియని వాహనం ఢీ ఒకరు మృతి



**ఇందల్వాయి, జూలై 28 (జనంసాక్షి)** ఇందల్వాయి మండల కేంద్రంలోని నిన్న రాత్రి 8 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని 35 నుంచి 40 సంవత్సరాల గల మగ వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ నిజామాబాద్ వైపు వెళ్ళుతుండగా గంగారం తండా గ్రామ శివారులో హనుమాన్ టెంపుల్ వద్ద ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అట్టి వ్యక్తికి తీవ్రమైన గాయాలు కాగా నేషనల్ హైవే అంబులెన్స్ లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినాడు ఎవరైనా వ్యక్తిని గుర్తుపట్టినచో ఇందల్వాయి పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వవలసిందిగా కోరుచున్నాము.

## లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా లుక్క గంగాధర్

**కమ్మర్పల్లి జులై 28(జనంసాక్షి)**లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్ పల్లి మాజీ అధ్యక్షుడు లుక్క గంగాధర్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్ పల్లి అధ్యక్షుడు తెడ్డు రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెడ్డు రమేష్ మాట్లాడుతూ లుక్క గంగాధర్ నాయకత్వంలో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమై సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని,ప్రజలకు విశేష సేవలు అందించాలనిఅన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం
# చలో హైదరాబాద్ తపస్ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

**గన్నేరువరం, జులై 28 (జనంసాక్షి):**ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర శాఖ చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం గన్నేరువరం మండల వనరుల కేంద్రంలో తపస్ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శి దామరపెల్లి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో మండల విద్యాధికారి కుడిదిల రామయ్య పోస్టర్‌ను ఆవిష్కరించి, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జారతి నర్సయ్య మాట్లాడుతూ 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని, 2004 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల తొమ్మిది నెలల సమ్మె కాలానికి జీతాలు చెల్లించి వారికి ఎంటీఎస్ వర్తింపజేయాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి దామరపెల్లి శ్రీనివాస్‌రెడ్డి




మాట్లాడుతూ జీవో-25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, 2008 డీఎస్సీ ద్వారా నియామకమైన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాముల నరేందర్, ఎర్రం మల్లేశం, గుండ కిరణ్, గజ భీంకార్ మహేష్, కె. రవీందర్, నరేష్‌కుమార్, కంది శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, అనిత, ప్రసన్న, స్వరూప, శోభారాణి, సునీత, శ్రీవాణి, స్వప్న, సుజాత, విజయలక్ష్మి, శ్రీదేవి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణకట్టలో వసూళ్ల ఆరోపణలు

## అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకుంటాం ఈవో రమాదేవి

**రాజన్న సిరిసిల్లజిల్లా జులై 28 (జనంసాక్షి):**వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తుల నుంచి నాయి బ్రాహ్మణులు డబ్బులు డిమాండ్ చేశారంటూ ఆలయ ఈవో రమాదేవికి ఫిర్యాదు అందింది. వరంగల్ జిల్లాకు చెందిన హసీనా, యాకూబ్ భాష దంపతులు స్వామివారి దర్శనానికి వచ్చి తమ మొక్కుబడిలో భాగంగా తలనీలాలు సమర్పించేందుకు కళ్యాణకట్టకు వెళ్లారు. రూ.50 టికెట్ తీసుకున్నప్పటికీ అక్కడి నాయి బ్రాహ్మణులు అదనంగా డబ్బులు డిమాండ్ చేశారని భక్తురాలు ఆరోపించారు. ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించిన అనంతరం ఈవో రమాదేవికి వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఆలయ ఈవో రమాదేవిని వివరణ కోరగా, కళ్యాణకట్టలో భక్తుల నుంచి బలవంతంగా నగదు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఈ అంశంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఎవరూ కళ్యాణకట్టలో అదనంగా డబ్బులు చెల్లించవద్దని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా ఆలయ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఈవో రమాదేవి సూచించారు.



# రుద్రంగిలో భూధార్ పై రైతులకు అవగాహన సదస్సు

**రుద్రంగి, జూలై 28 (జనం సాక్షి):**స్థానిక రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం భూధార్ మరియు భూ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి హాజరై మాట్లాడారు. ప్రతి రైతు తన భూమికి సంబంధించిన భూధార్ విశిష్టతను తెలుసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి పౌరుడికీ ఆధార్ కేటాయించినట్లే దేశంలోని ప్రతి కమతానికీ ఒక విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని తెలిపారు. భూధార్ వల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి భూమికి 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. దీనివల్ల భూమికి శాశ్వత రికార్డు ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు సాయం, హక్కుల పరంగా గుర్తింపు సులభంగా లభిస్తుంది. 90 ఏళ్ల తర్వాత తెలంగాణలో చేపడుతున్న జిపిఎస్ ఆధారిత భూ రీ-సర్వే వల్ల హద్దుల సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ సర్పంచ్ గండి నారాయణ, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# విషాదంలోనూ మహాదానం

మంథని, జులై 28 (జనంసాక్షి):పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని పాలకుర్తి మండలం కన్నాలశాలపల్లికి చెందిన చింతకింది భీమ లక్ష్మణ్ గుండెపోటుతో మృతి చెందగా, కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ ఆయన నేత్రాలను దానం చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. సదాశయ ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుడి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగిందని నిర్వాహకులు చింతకింది కనకయ్య, కుందారపు సతీష్, బొడ్డుపెల్లి లక్ష్మణ్, మేన మహేందర్ తెలిపారు. అనంతరం నేత్రదాత చింతకింది భీమ లక్ష్మణ్‌కు ఘనంగా నివాళులర్పించారు. విషాద సమయంలోనూ నేత్రదానానికి అంగీకరించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన ఆయన భార్య కవిత,



కూతుళ్లు అల్లుళ్లు శివాని రాకేశ్, వైష్ణవి ఆదిత్య, కుటుంబ సభ్యులు చింతకింది భాస్కర్, వెంకటేష్, ప్రసాద్, సంతోష్, అంజయ్య, గుండేటి రమేష్‌లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి మెర్గు భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు ధన్యవాదాలు తెలిపారు.

# దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

**గంభీరావుపేట జూలై 28 (జనం సాక్షి):**గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో నీ స్థానిక మోడల్ స్కూల్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎ.అరుణ, డాక్టర్ అఖిల్‌తో పాటు వైద్య సిబ్బంది విద్యార్థుల ఎత్తు, బరువు, కంటి చూపు, దంతాలు, వినికిడి, రక్తహీనత తదితర అంశాలను పరీక్షించారు. అనంతరం రక్తహీనత నివారణలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థులను తదుపరి చికిత్స కోసం సంబంధిత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబుజాన్, సుమలత, సుహాసిని, మంజులతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని, ఐరన్ మాత్రలను వైద్యుల సూచనల మేరకు తీసుకోవాలని వైద్యులు సూచించారు.



# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

## చెక్కులతో పాటు తులం బంగారం హామీని అమలు చేయాలి

**వీణవంక, జులై 28 (జనం సాక్షి) :** వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని వీణవంక-7, దేశాయపల్లి-3, నర్సింగాపూర్-3, వల్బాపూర్-2, పోతిరెడ్డిపల్లి-8, రెడ్డిపల్లి-1, శ్రీరాములపేట-2, బొంతుపల్లి-2, బ్రాహ్మణపల్లి-1, చల్లూర్-4, ఇప్పలపల్లి-1, గంగారం-3, హిమ్మత్‌నగర్-2, కనపర్తి-2, కిష్టంపేట-2, కొండపాక-3, మల్లన్నపల్లి-1, మల్లారెడ్డిపల్లి-4, మామిడాలపల్లి-5 గ్రామాలకు చెందిన మొత్తం 55 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు వచ్చినది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా వివాహం చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి అందిస్తామని ప్రకటించిన



తులం బంగారాన్ని కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రవి సుధాకర్, మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, సర్పంచులు దాసరపు సరోజన రాజేంద్రప్రసాద్, జడల రమేష్, గజ్జల మొగిలి, శ్రీమతి, మెడగొని తిరుపతి, సంపత్‌రెడ్డి, మండల కుమార్, మాజీ వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్లు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాములు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు మాదాసి సునీల్, ఎండీ రషీద్, సతీష్, నాయకులు ఎండీ ఫసియోద్దీన్, వడ్డేపల్లి భూమయ్య, నాగిడి సంజీవరెడ్డి, నీల శ్రీకాంత్, మల్లయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రాజాగౌడ్

**కథలాపూర్, జూలై 28 (జనం సాక్షి):**కథలాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌ను జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో లోకిని శ్రీనివాస్‌తో కలిసి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నిర్వహణ, వంటశాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి : ప్రత్యేక అధికారి

**పెద్ద కొడప్గల్, జూలై 28 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి బలరాం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ... అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారని వ్యవసాయ శాఖ మండల అధికారి కిషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంఏఓ కిషన్ బదిలీస్తూ.. నిలువ, ధరల పట్టిక బోర్డులను ఏర్పాటు చేయుటకు ఆదేశాలు జారీ చేస్తానని, అధిక ధరలు తీసుకుంటున్నట్లు దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. పీఎం కిసాన్ పథకంపై ప్రశ్నించగా ఎంఏఓ కిషన్ బదిలీస్తూ పీఎం కిసాన్ పథకం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే పథకమని, మార్పులు చేర్పులు చేయుటకు తమకు ఎటువంటి అధికారాలు లేవని తెలిపారు. వైద్యశాఖ సమీక్ష సమయంలో వైద్యుడు ఉమాకాంత్ మాట్లాడుతూ ఎలాంటి చిన్న అనుమానం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఎచ్పీవీ వ్యాక్సిన్‌పై సర్పంచ్



వినోద్ ప్రశ్నించగా ఆధార్ కార్డు ఆధారంగానే కాకుండా అమ్మాయి జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాల బోనాఫైడ్ ఆధారంగా కూడా వ్యాక్సిన్ ఇస్తామని తెలిపారు. 14వ పుట్టినరోజు జరుపుకుని 15వ పుట్టినరోజు కాకముందే వ్యాక్సిన్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ పనులపై సమీక్షలో సర్పంచ్ సాయగౌడ్ మాట్లాడుతూ.. అంజని గ్రామ పాఠశాలకు అదనపు తరగతి గదులు అవసరం ఉందని, అంగన్వాడి కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని, పాఠశాల స్థలం కబ్జాకు గురైందని తెలుపగా అధికారులు బదిలీస్తూ అదనపు తరగతి గదులు, అంగన్వాడి భవనంకై ఉన్నతాధికారి నివేదికను అందజేస్తామని, కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. పోచారం గ్రామ సర్పంచ్ బాలాజీ రావు పటేల్ మాట్లాడుతూ... అంజని గ్రామం నుంచి పోచారం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా కబ్జా చేయడం వల్ల ఇరుకుగా మారిందని అధికారుల దృష్టికి తీసుకురాగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ శాఖ మండల అధికారి శ్రీనివాస్ బదులిస్తూ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి స్లాబ్ కొలతలపై చర్చ జరగగా హౌసింగ్ ఏఈ జ్యోతి బదులిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొలతలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొందరు లబ్ధిదారులు ఇంటిపై మరొక నిర్మాణానికి పనులు ప్రారంభించారని, అట్టి లబ్ధిదారులకు చివరి బిల్లు రాదని తెలిపారు. ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్ మాట్లాడుతూ.. జలసిరి కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సర్పంచ్లకు సూచించారు. తహసిల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయుటకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించాలని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

**సదాశివనగర్, జూలై28 (జనంసాక్షి):** గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి అశోక్ అధికారులకు సూచించారు. సదాశివనగర్ మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రత్యేక అధికారి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, తమ గ్రామాలకు సంబంధించిన తాగునీటి సరఫరా, రోడ్లు, విద్యుత్ సమస్యలు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచులు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు స్పందిస్తూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సంతోష్ కుమార్, వ్యవసాయ అధికారి ప్రజాపతి, సీడీసీ చైర్మన్ ఇర్షాదుద్దీన్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

### కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై29 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొనే కాలానుగుణ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్యం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ తదితర శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధంగా ఉంచి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# పక్షులు పర్యావరణ స్పృహపై సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించాలి

### కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 29 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా "పక్షులు - పర్యావరణ స్పృహ" అంశంపై సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం దోమకొండ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి పర్యావరణ స్పృహను పెంపొందించుకుని ప్రకృతి, పక్షుల సంరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. పక్షులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. సంఖ్యాశాస్త్రాన్ని నిత్య జీవితంలో అన్వయించుకునే విధంగా నేర్చుకోవాలని, పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, ప్రయోగశాలలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరుగుదొడ్లను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రయోగశాలల్లో అందుబాటులో ఉన్న పరికరాలను సక్రమంగా వినియోగిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, విద్యాశాఖ సమన్వయకర్త వేణుగోపాల్, మండల విద్యాశాఖాధికారి విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్. ఇతర అధికారులు పాల్గొన్నారు.





## ఎంపీ దిష్టి బొమ్మ దహనం

### దేశ విద్యార్థులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి

### బివిఎం,యుఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల డిమాండ్



**ఆర్మూర్, జూలై 28 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను పెద్దఎత్తున నినాదాలతో భారీ ర్యాలీతో వచ్చి దహనం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు తలొగ్గి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రిత్వ శాఖ రాజీనామా చేశారన్నారు. విద్యార్థులంతా పార్లమెంట్ వైపుకు వాటి ముట్టడికి అడుగులు వేయగా తెలంగాణ రాష్ట్ర చేవెళ్ల ఎంపీగా ఉన్నటువంటి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరసన తెలిపిన వారిని కేవలం లాఠీ చార్జ్ చేశారన్నారు.ఇతర దేశాలలో కాల్చి చంపుతారంటూ వారిని వారి ఉద్యమాన్ని చులకన చేసి హింస ప్రేరేపిత వ్యాఖ్యలను చేసినటువంటి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పైన బీజేపీ పార్టీ చర్యలు తీసుకొని భర్తను చేయాలని చెప్పి విద్యార్థి సంఘాల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బివిఎం ఉమ్మడి రాష్ట్రాల కోఆర్డినేటర్ బట్టు శ్రీధర్,యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధాల నాగరాజ్,ఎన్ఎస్యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్ ,విద్యార్థి నాయకులు జవహర్, సురేందర్ ,యువ నాయకులు రాజేష్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా గ్రామాభివృద్ధే లక్ష్యం

## చిన్నవాల్గొట్‌లో ఇంటింటికీ వెళ్లి ఖాతాలు ప్రారంభిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు

**సిరికొండ, జూలై 28 (జనం సాక్షి):** గ్రామాలను మోడల్ విలేజ్‌లుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పాటు ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా ఉండేలా చేయడం, ప్రతి ఖాతాదారునికి బీమా రక్షణ కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక చేరిక (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్) కార్యక్రమానికి అనుగుణంగా గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడానికి అధికారులు గ్రామాల్లోనే సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దవాల్గొట్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నారాయణ ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది చిన్నవాల్గొట్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి బ్యాంకు ఖాతాలు లేని వారిని గుర్తిస్తున్నారు. ప్రమాద బీమా, జీవిత బీమా వంటి సామాజిక భద్రత పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, తక్కువ ప్రీమియంతో లభించే



బీమా పథకాల ప్రయోజనాలను వివరించారు. గ్రామస్థులు కూడా ఈ కార్యక్రమానికి విశేషంగా స్పందిస్తూ అవసరమైన పత్రాలను సమర్పించి కొత్త ఖాతాలు ప్రారంభించుకుంటున్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా బీమా పథకాలు కుటుంబాలకు అండగా నిలుస్తాయని అధికారులు వివరించారు. గ్రామానికి వచ్చి ప్రజలకు నేరుగా బ్యాంకింగ్ సేవలు అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి అర్హుడికి బ్యాంకు ఖాతా, బీమా సదుపాయం కల్పించే వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని బ్యాంకు మేనేజర్ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నవాల్గొట్ గ్రామ సర్పంచ్ గణేష్, మాజీ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మోహన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రమణ, బుచ్చన్న, నగేష్,శ్రీనివాస్, సి ఏ రాజేశ్వర్,కారోబార్ సాయిరాం, తెలంగాణ గ్రామీణ బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వ్యాస పోటీ, పర్యావరణ అవగాహనతో జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహించిన లయన్స్ క్లబ్




కరీంనగర్ టౌన్, జూలై 28, ( జనంసాక్షి) విద్యార్థుల్లో తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రేమ, కృతజ్ఞత భావాన్ని పెంపొందించేందుకు కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంకమ్మతోటలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించి విజేతలను సత్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ, పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కుటుంబ విలువలను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ లయన్స్ క్లబ్‌ను అభినందించారు.వ్యాస రచన పోటీలో విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే ఉద్దేశంతో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి పర్యావరణహిత వస్త్ర సంచులు పంపిణీ చేశారు. విద్యార్థులకు చాక్లెట్లు అందజేసి కార్యక్రమాన్ని ఉత్సాహాభరితంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్, బట్టు వినోద్, మేతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, రాచకొండ సంతోష్, సింగమరాజు తదితరులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరి సాగు వద్దు.. ఆరు తడి పంటలే ముద్దు..!

- ఎలినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- సబ్సిడీపై రైతులకు కంది విత్తనాలు అందిస్తున్న ప్రభుత్వం
- మంథని వ్యవసాయ శాఖ ఏడిఏ అంజని



కమాన్ పూర్, జూలై 28 (జనంసాక్షి ) : వరి సాగు వద్దు.. ఆరు తడి పంటలే ముద్దు..!, అని ఎలినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలైన ఆరుతడి పంటలను సాగు చేయాలని మంథని వ్యవసాయ శాఖ ఏడిఏ అంజని రైతులకు సూచించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం గుండారం రైతు వేదికలో విత్తన మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత ఎల్నినో ప్రభావం వలన చెరువుల కింద కాలువల ద్వారా నీరు అందకుండా వరి నార్లు ముదిరిపోయి రైతు సోదరులు వరి నాట్లు వేయలేకపోయారు. ఇట్టి సందర్భంలో రైతు సోదరులు పంట పొలాలను బీడుగా ఉంచకుండా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుగుణంగా కంది పంట సాగు చేసే రైతు సోదరులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు అందించడం జరుగుతున్నదని తెలిపారు. రైతు సోదరులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద సంప్రదించినట్లయితే మీకు సబ్సిడీ ద్వారా కంది విత్తనాలు అందించబడతాయి అని పేర్కొన్నారు. అలాగే పూర్తి ఉచితంగా ఆముద గింజ విత్తనాలు, పంట దిగుబడిని కూడా కొనుగోలు చేసే విధంగా అవకాశం కలదని, రైతు సోదరులు ఎలాంటి నీటి వసతి లేని వారు ఆముదం పంటను అంతర్ పంటగా గాని ముఖ్యమైన పంటగా గాని సాగు చేసుకుని సుమారుగా 6 నుంచి 7 క్వింటాల్స్ దిగుబడిని పొందగలరు, దీని కొరకు రైతు సోదరులు ఏ విధమైన పెట్టుబడులు వెచ్చించవలసిన అవసరం లేదన్నారు. అదేవిధంగా వరి పంటకు బదులుగా ఆయిల్ ఫామ్ సాగు చేసినట్లయితే తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం సాగు చేసి ప్రకృతి వైపరీత్యాలనుండి తట్టుకొని అధిక లాభం ఆర్జించవచ్చని తెలిపారు. ఉద్యానవన పంటలు అయినటువంటి మామిడి సాగు ఆసక్తిగల రైతులకు ఉచితంగా బంగన్పల్లి, తోతాపురి రకాల మొక్కలను ఉచితంగా అందించడం జరుగుతుంది.కావున రైతు సోదరులు వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, రైతు సోదరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా పేరపల్లి - రొంపికుంట కల్వర్టు..!




కమాన్ పూర్, జూలై 28, ( జనంసాక్షి ) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పేరపల్లి నుండి రొంపికుంట వెళ్లే ప్రధాన రహదారిలో పోచమ్మ మూల మలుపు వద్ద గల కల్వర్టు ప్రమాద కారంగా మారింది. కల్వర్టు మీద తారు రోడ్డు బాగానే కనిపిస్తున్న కింద పైపులు కుంగి తారు కింద గల మట్టి కిందకు జారి మధ్యలో ఖాళీ స్థలం ఏర్పడింది. ఆ దారిలో వెళ్ళే వాహన దారులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు మరమ్మతులు చేయడానికి కమాన్ పూర్ మండల పంచాయతీ రాజ్ ఇంచార్జి ఏఈ వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఏఈ వరలక్ష్మి మంగళవారం కృంగిపోయిన కల్వర్టు ను పరిశీలించారు. ఈ సందర్భంగా పేరపల్లి గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య, రొంపికుంట గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ లు ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చుట్టు పక్కన గ్రామాల ప్రజలకు, ఆ రహదారి వెంట వెళ్లే వాహన దారులకు పలు సూచనలు చేశారు. శాఖాపరంగా అనుమతులు వచ్చి మరమ్మతులు పూర్తి అయ్యేవరకు వాహన దారులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే భారీ వాహనాలను ఈ దారి గుండా వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ఇరు గ్రామాల సర్పంచ్ లు కోరారు.

## రైతు వేదికలలో విత్తన మేళా రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు

కథలాపూర్ జూలై 28 (జనం సాక్షి) కథలాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మరియు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు సందర్శించారు వివిధ రకాల విత్తనాలు ( కుసుమలు, పెసర్లు, అనుములు, కందులు, అలసంద మొక్కజొన్న, ఉల్లి, కూరగాయలు) గురించి అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి యోగిత కందులు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వివరించడం జరిగింది. ఈ వానాకాలం ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురుస్తాయి అని వాతావరణ శాఖ వారు చెప్పడం వలన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ కాంటీన్జెన్సీ ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఈ ప్రణాళికలో భాగంగా ఆరుతడి పంటలు అయినటువంటి కంది, పెసర, మినుము, కుసుమ, అలసంద, అనుములు, కూరగాయలు వంటి పంటలను రైతు సోదరులు వేయాలని ప్రభుత్వం సూచించడం జరిగింది ఈ సూచనలో భాగంగా రైతు వేదికలలో విత్తనమేలాను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్,అలాగే మండల వ్యవసాయ అధికారి యోగితా మేడం, అలాగే మండల పంచాయతీ అధికారి ఎంపీవో అలాగే వివిధ గ్రామాల సర్పంచులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు హరీష్,సంధ్య ,మౌనిక,సుష్మ శ్రీ, రాఘవేంద్ర మరియు విత్తన డీలర్లు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ సాయం



కమాన్‌పూర్, జూలై 28, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నివసించే చెన్నోజు శంకరయ్య కుమారుడు చెన్నోజు శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న సుందరం ఫౌండేషన్ ఫౌండర్, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. సుభాష్ నగర్ లో నివసించే పేద కుటుంబానికి చెందిన మల్యాల నారాయణ గౌడ్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా వారిని పరామర్శించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రెండువేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భూంపెల్లి మొండన్నతో పాటు ఫౌండేషన్ సభ్యులు కావేటి గోపాల కిషన్, చెన్నోజు చంద్రశేఖర్ దండె తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో మెగా రక్తదాన శిబిరం

- మండలంలో విద్యార్థులకు పండ్ల పంపిణీ
- పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు



ఎడపల్లి, జూలై 28 ( జనంసాక్షి ) : ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం నిర్వహించడంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలోని కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ మేరకు ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో గల కాంగ్రెస్ నాయకులు తమ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఎడపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన చేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్ సేవలు ప్రశంసనీయమన్నారు. ముస్ముందు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయు రారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు జైతాపూర్ సర్పంచ్ నాగుల రాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్ కుమారులు మనితేజ, సహకార సంఘం చైర్మన్ లు కరటూరి సత్యనారాయణ, పోలా మల్కారెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్ రజిత యాదవ్, మంగల్ పాడు సర్పంచ్ చేపూరు వీణ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ బాబన్న, కుర్నాపల్లి సర్పంచ్ పరిగె సాయిలు, ఉప సర్పంచ్ స్వామి, నెహ్రూనగర్ కాంగ్రెస్ నాయకులు ఖాజా, పోచారం సర్పంచ్ నీరడి జ్యోతి రవికుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బాపూనగర్ లింగం, ఏఆర్పి క్యాంపు సర్పంచ్ వినోద్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ రెడ్డి, నవీన్, ఫరాన్, మస్తాన్, తాహెర్, కిషోర్, ఎజాజ్, యాసాద రాజ్ కుమార్, గంగాధర్, మాణిక్ ఎల్లయ్య యాదవ్, పొద్దు భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఆర్టీయు మండల నూతన కార్యవర్గం ఎన్నిక



**పెద్ద కొడప్గల్ జూలై 28 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల పీఆర్టీయు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడిగా జగదీశ్, ప్రధాన కార్యదర్శిగా కిషోర్, అసోసియేట్ అధ్యక్షులుగా రమేష్, మహిళ అసోసియేట్ అధ్యక్షులుగా రజిని, ఉపాధ్యక్షులుగా సుందర్ సింగ్, మహిళ ఉపాధ్యక్షులుగా లలిత, కార్యదర్శులుగా బక్షిరామ్, ప్రకాష్, మహిళ కార్యదర్శులుగా స్రవంతి, సురేఖ లను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు అల్లాపూర్ కుషాల్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉన్నారు.

## తెలంగాణ జలసరి కార్యక్రమంపై గ్రామసభలు నిర్వహించాలి



**ఇందల్వాయి జిల్లా ప్రతినిధి జూలై 28:(జనం సాక్షి)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసరి' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో సూచించారు.ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీచార్జ్ నిర్మాణాలు, కాలువల నిర్మాణం వంటి నీటి సంరక్షణ చర్యలను గ్రామస్థుల భాగస్వామ్యంతో చేపట్టాలని తెలిపారు.అలాగే, ఇందిరమ్మ ఇళ్ల వద్ద ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐకేపీ (×ఖూ) ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఇంకుడు గుంతల ఏర్పాటు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు.

## కాంతి హైస్కూల్‌లో ఘనంగా బోనాల పండుగ



**ఆర్మూర్,జూలై 28 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ కాంతి హై స్కూల్ లో బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ శశాంక్ రెడ్డి మాట్లాడుతూ బోనం అంటే భోజనమని,బోనాలు ఆషాడ మాసం నుండి శ్రావణమాసం చివరి వరకు గ్రామ దేవతలకు సమర్పిస్తారన్నారు.మహమ్మారి ప్రజలను పిడిస్తున్నందున బోనాలను సమర్పిస్తారన్నారు.అమ్మ వారు శక్తి స్వరూపినిగా మారి మహమ్మారిని సంహరించి ప్రజలను కాపాడిందనే నానుడి ఉందన్నారు.కొత్త కుండను తీసుకొని పసుపు కుంకుమలతో కుండను అలంకరించి అందులో అన్నాన్ని పెట్టి వేపాకులతో, పూలతో అలంకరించి కుండ పైన మూత పెట్టి అందులో దీపాన్ని వెలిగించి మహిళలందరూ గుంపులుగా పాటలు పాడుతూ గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించి,పాడి పంటలను ప్రజలందరినీ కాపాడమని ప్రార్థిస్తారని విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతి,సాంప్రదాయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని వారి నృత్యాలతో అలరించారు.వీరితో పాటు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే వేముల



**కమ్మర్పల్లి జులై 28(జనంసాక్షి)** మండల కేంద్రంలోని తాహాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం రోజున సర్ ప్రకీయను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ప్రతి పోలింగ్ బూత్ లో ప్రతి ఇంటికి ఒకటికి రెండు సార్లు వెళ్లి ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేయాలని బిఎల్ఏ,బూత్ లేవల్ ఏజెంట్లు లకు అధికారులకు సూచించారు.ఎవరైనా అనర్హులై ఉంటే కూడా తప్పకుండా ఓటు హక్కును తొలగించాలని కోరారు.శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లినవారు బూత్ లెవెల్ ఏజెంట్ లు వారి గురించి ఒకటికి రెండుసార్లు సమాచారం వారి బంధువుల ద్వారా తెలుసుకోవాలని,మరణించిన ఓటర్లను గుర్తించాలని అన్నారు.సర్ ప్రక్రియను ఆగస్టు 3 వరకు పొడిగించారు కావున మళ్ళీ ఒక్కసారి ప్రతి బూతులో మొత్తం ఓటర్ సంఖ్య నమోదు సంఖ్య ను సరి చూడాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్,కమ్మర్పల్లి ఉప సర్పంచ్ కొత్తపల్లి అశోక్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్న రెడ్డి, వి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, యూత్ అధ్యక్షులు కొత్తపల్లి రఘు,మాజీ ఎంపిటీసీలు పిప్పర అనిల్,మైలారం సుధాకర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు హైమద్ హుస్సేన్,రెంజర్ల మహేందర్,బద్దం రాజేశ్వర్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ధూంధాం కళాకారుల బోనాల జాతర

### కళాకారుల ఐక్యతను చాటేందుకు రాష్ట్రంలో మొదటిసారి బోనాలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 28: జనంసాక్షి** తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల బోనాల జాతర ఘనంగా నిర్వహించామని జిల్లా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల వేదిక ఆధ్వర్యంలో బోనాల జాతర కార్యక్రమాన్ని ఐక్యత కోసమే జరిపామన్నారు. మంగళవారం మాక్లూర్ మండలంలోని ఓట్యాట్ పల్లి లో ఒడ్డేటవ్వ వద్ద బోనాలు సమర్పించారు. ముందుగా గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి కళాకారులు పూల మాల వేశారు. కామన్ నుంచి డప్పు దరువులతో శివ సత్తుల, పోతరాజు నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం వేదిక ఏర్పాటు చేసి కళాకారులు తెలంగాణ ఉద్యమ ఉద్యమ పాటలు అలరించాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అష్ట గంగాధర్, కోశాధి కారి రాంపూర్ సాయి లు మాట్లాడుతూ.. జిల్లా కళాకారుల ఐక్యత చాటేందుకు అమ్మ వారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం కోసం కష్టపడిన అర్హులైన అన్ని విభాగాల్లో ఉన్న కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని నియోజక వర్గాలలో జిల్లా ధూంధాం కళాకారుల ఆధ్వర్యంలో త్వరలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉపాధ్యక్షురాలు రేలారే రేలా గంగా మాట్లాడుతూ కళాకారులకు మంచి జరగాలని అమ్మ ఆశీర్వాదం కోసం బోనం సమర్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం మొదటి సారి నిజామాబాద్ లో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. అన్ని జిల్లాలు మా ఐక్యతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. తెలంగాణ వచ్చిన కళాకారుల జీవితాలు పూర్తిగా మారలేదని, ఎంతో దుర్భరంగా ఉన్నాయని గుర్తుచేశారు. వెంటనే ప్రభుత్వం కళాకారుల త్యాగాన్ని గుర్తించాలన్నారు. జిల్లా లోని కళాకారులు ఒక కుటుంబంగా ఒకే దగ్గర కలవడం ఉద్యమ సమయాన్ని గుర్తు చేశాయన్నారు. ఉద్యోగాల కోసం కళాకారులు వెయ్యి కండ్లతో ఎదిరి చూస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి అందించే సహాయం తొందరగా అందించాలని కోరారు.ఈ బోనాల కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగా, గోదావరి, సాయి లోవోల, సవిత, రాజేందర్ , సలహాదారులు పస్కా నర్సయ్య, పాశం కుమార్, బొడ్డెన్న యాదవ్, కోకిల నాగరాజు, సహాయ కార్యదర్శి కర్క రమేష్, క్రాంతి కుమార్, గోరకంటి రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్, ప్రశాంత్ రెడ్డి, మహేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు చిట్టిబాబు, మాదాసు గోపి, తోగరి నర్సయ్య, చిన్న రాజేందర్, రవి నాయక్, డప్పు సంతోష్, మనోజ,దివ్య, మానస, స్రవంతి, సమత, లత, శ్వేత జిల్లా ఉద్యమ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి

**నిజామాబాద్ పార్లమెంట్ పరిధి రైల్వే ప్రాజెక్టులపై వినతి**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై28: (జనంసాక్షి)** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ROB) మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (RUB) నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గడంతో పాటు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించబడి ప్రయాణ భద్రత మరింత మెరుగుపడుతుందని ఎంపీ వివరించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల ఇందల్వాయి, జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (ROBs) మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత మరియు రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు.

## బస వేణుగోపాల్ యాదవ్‌ను సన్మానించిన సర్పంచ్ గంగారెడ్డి

**కమ్మర్పల్లి జులై 28(జనంసాక్షి)** తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ మెంబర్ బస వేణుగోపాల్ యాదవ్ ను మంగళవారం రోజున హాసకొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి పాలకవర్గం సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గంగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. వేణుగోపాల్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ,ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్యి శ్రీనివాస్, రాధారావు పసుల గంగు తదితరులు పాల్గొన్నారు.



### ఎంపీడీవో మాట్లాడుతుంటే..

## ఫోన్లలో అధికారులు!

**సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై విమర్శలు**




**కామారెడ్డి ప్రతినిధి జులై28 (జనంసాక్షి):** సదాశివనగర్ మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో ఎంపీడీవో సంతోష్ కుమార్ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై మాట్లాడుతున్న సమయంలో కొందరు శాఖల అధికారులు తమ మొబైల్ ఫోన్లలో నిమగ్నమై కనిపించడం పలువురి ఆగ్రహానికి కారణమైంది.ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్న కీలక సమావేశంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారులు ప్రసంగాన్ని పట్టించుకోకుండా ఫోన్లలో తలమునకలవడం సమావేశం గౌరవాన్ని తగ్గించిందని పలువురు అభిప్రాయపడ్డారు.ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే సర్వసభ్య సమావేశాలను అధికారులు మరింత బాధ్యతగా తీసుకోవాలని, సమావేశం సమయంలో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి చర్చలపై పూర్తి దృష్టి సారించాలని ప్రజా ప్రతినిధులు సూచించారు. సమావేశాల్లో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## లక్ష్మినరసింహస్వామి ఆలయ నిర్మాణానికి

# ముందడుగు..

**దేవాదాయ శాఖ కమిషనర్‌కు -10లక్షల డిపాజిట్ పత్రాలను అందజేసామన్న చైర్మన్ వేణు**

**రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామని అధికారుల హామీతో సంతోషంలో భక్తులు..**



**చిగురుమామిడి జులై 28(జనంసాక్షి):**
మండలంలోని రేకొండ గ్రామంలో వెలిసిన శ్రీస్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.ఆలయ నిర్మాణ పనులకు సంబంధించి ?10లక్షల రూపాయల బ్యాంక్ డిపాజిట్ అమౌంట్ తాలూకు పత్రాలను దేవాదాయ శాఖ సెక్రటరీ,ఎండోమెంట్ కమిషనర్‌కు అందజేసినట్లు ఆలయ చైర్మన్ కొలిపాక వేణు ఒక ప్రకటనలో తెలిపారు.ఆలయ గౌరవ అధ్యక్షుడు,మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డితో కలిసి మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నతాధికారులను కలిసి ఈ పత్రాలను అందజేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా అధికారులు సానుకూలంగా స్పందించారని,రాబోయే రెండు రోజుల్లోనే ఆలయ నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను పిలుస్తామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ వేణు పేర్కొన్నారు.ఆలయ నిర్మాణ పనులు త్వరలోనే పట్టాలెక్కనుండటంతో స్థానిక భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మామిడి అంజయ్య,కాసాని సతీష్,అన్న సదానందం, కారంపొడి వెంకటేశం,బిల్లా తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలి

### బోయిన్‌పల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

### ఒక్క ఓటరు కూడా తప్పిపోవద్దు: వైద రామానుజం

**బోయిన్‌పల్లి, జులై 28 (జనం సాక్షి)**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడాలని ఎస్ఐఆర్ ప్రవాస్ యోజన మండల ఇన్‌చార్జ్ వైద రామానుజం అధికారులకు సూచించారు. బోయిన్‌పల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్‌తో కలిసి మంగళవారం ఆయన ఎస్ఐఆర్ ప్రత్యేక పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా పలు పోలింగ్ బూత్ లను సందర్శించి, బిఎల్ఓ లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 3వ తేదీలోగా ప్రత్యేక సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎన్నికల అధికారులను కలసి గ్రామీణ ప్రాంతాల్లో బూత్‌ల సంఖ్య, ఓటర్ల నమోదుపై చర్చించారు.

**పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లాలి**

అనంతరం భాజపా మండల ప్రధాన కార్యవర్గం, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులతో రామానుజం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రైతుల బకాయిలు చెల్లించాలి: బీజేపీ డిమాండ్

**వేములవాడ రూరల్, జూలై 28 (జనంసాక్షి):**
గత యాసంగి సీజన్ ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడ రూరల్ మండల పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల కుంభకోణంపై పూర్తి వివరాలు వెల్లడించి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆందోళనలు చేస్తున్న మర్రిపల్లి, మల్లారం, నూకలమర్రి గ్రామాల రైతుల పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమన్నారు. శ్రావణమాసం సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఆలయ అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, సురేందర్ రావు, సంతోష్ బాబు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

### గంభీరావుపేట మండల కేంద్రంలో విషాదం

**గంభీరావుపేట జూలై 28 (జనంసాక్షి);**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పిట్ల బాబు (41) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య హైమావతి తెలిపినట్టు నాలుగు నెలల క్రితం టాక్టర్, గడ్డి కట్టే మిషన్ కొనుగోలు చేసి అప్పులు తీరకపోవడంతో ఆశించిన పని దొరకకపోవడంతో మనస్థాపంతో ఇంటిలోని ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడు సోదరుడు పిట్ల లక్ష్మణ్ ద్వారా భార్యకు తెలియడంతో ఆమె గంభీరావుపేటకు వచ్చి పరిశీలించగా మృతి చెందినట్లు భార్య ఫిర్యాదు మేరకుసమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.మృతుడి మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## మంగళ్ పాడులో ఉచిత వైద్య శిబిరం

**ఎడపల్లి, జూలై 28 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండలం మంగల్ పాడు గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లిల సంయుక్త నిర్వహణలో మెగా వైద్య శిబిరము ఉచితముగా నిర్వహించారు. ఈ మేరకు ఆరోగ్య శిబిరంలో జనరల్ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షల సైతం నిర్వహించడం జరిగింది. అలాగే ఉచితంగా మందులను సైతం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి అధ్యక్షులు దుర్గారావు, సెక్రటరీ రమణారెడ్డి, శ్రీనివాసరాజు, గాంధీ, చక్రవర్తి, ఎడపల్లి క్లబ్ నుండి గంగారెడ్డి, ప్రకాష్, మెర్సీ, పుష్పలత, సెక్రటరీ అరుణ్ కుమార్ గౌడ్, ప్రెసిడెంట్ రాకేష్ వర్మ, వైద్యులు బిల్ల మణిదీప్ లు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం చైర్మన్ గా సూర్యనారాయణ, కో చైర్మెన్ గా చక్రవర్తిలు వ్యవహరించారు.






## కమాన్‌పూర్‌లో అత్యధికంగా 59.8 మి.మీ. వర్షపాతం నమోదు

**కమాన్‌పూర్, జూలై 28, ( జనంసాక్షి ) :**
పెద్దపల్లి జిల్లాలో మంగళవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవగా, కమాన్‌పూర్ మండలంలో అత్యధికంగా 59.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత పెద్దపల్లి మండలంలో 52.4 మి.మీ., పాలకుర్తి మండలంలో 52.2 మి.మీ., మంథని మండలంలో 43.6 మి.మీ., శ్రీరాంపూర్‌లో 38.0 మి.మీ., జూలపల్లి మండలంలో 34.6 మి.మీ., రామగుండం మండలంలో 29.2 మి.మీ., ఎలిగేడు మండలంలో 28.8 మి.మీ., సుల్తానాబాద్‌లో 26.2 మి.మీ., అంతర్గాం మండలంలో 22.6 మి.మీ., ఓదెల మండలంలో 19.6 మి.మీ., రామగిరి మండలంలో 18.4 మి.మీ., ధర్మారం మండలంలో 14.6 మి.మీ., ముత్తారం (మంథని) మండలంలో 14.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

### బీజేపీ నాయకుడు మంచే రాజేష్

**ధర్మపురి, జూలై 28 (జనంసాక్షి):**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్‌లో భాగంగా ధర్మపురి పట్టణ కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకుడు మంచే రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో విజయవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్‌లో భాగంగా పార్టీ కార్యకర్త ఇంటికి వెళ్లి కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. అనంతరం మండల కమిటీ, బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంచే రాజేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని అన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో ఉండేలా బీజేపీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేసి ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్, ఎస్ఐఆర్ పట్టణ కన్వీనర్ మండలజీ సూరజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, కోశాధికారి సంఘీ రాజేష్, ఎండోమెంట్ ధార్మిక అసెంబ్లీ కన్వీనర్ పాత నాగరాజు, అందాజ్ నవీన్, సీనియర్ నాయకులు గుండి రాజేశ్వర్, కాసరపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.






## పచ్చని చెట్లే జీవానికి ఆధారం - కల్నల్ ఏకే జయంత

### శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మొక్కలు నాటిన ఎన్సీసీ అధికారులు

**కరీంనగర్ టౌన్, జూలై 28, ( జనంసాక్షి)**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పచ్చని చెట్లే జీవరాశికి అసలైన ఆధారమని 9 తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఏకే జయంత అన్నారు. స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ గ్రూప్ రిపబ్లిక్ డే ఉత్సవాల పోటీల పర్యవేక్షణలో భాగంగా ఆయన కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 9 తెలంగాణ బెటాలియన్ అందించిన మొక్కలను కళాశాల ప్రాంగణంలో ఎన్సీసీ క్యాడెట్లతో కలిసి నాటారు. అనంతరం మాట్లాడిన కల్నల్ ఏకే జయంత, ప్రతి క్యాడెట్ తాను నాటిన మొక్కను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పచ్చని చెట్లు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవరాశి మనుగడకు ఎంతో కీలకమని ఆయన తెలిపారు. ప్రతి ఎన్సీసీ క్యాడెట్ తన గ్రామంలో, పరిసర ప్రాంతాల్లో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడడం ద్వారా సమాజానికి మెరుగైన భవిష్యత్తును అందించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, ఎన్సీసీ ఏఎన్‌వోలు మేజర్ రేళ్ల సంజీవ్, మేజర్ కిరణ్ జ్యోతి, త్రివేణి, జ్యోత్స్న మ్యాగీ, సందీప్ సింగ్, ప్రశాంత్, ఈ. స్రవంతి తదితరులు, ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం క్యాడెట్లు మొక్కల సంరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## మంథని ప్రభుత్వాసుపత్రిలో 24 గంటల ప్రసూతి పీడియాట్రిక్ సేవలు

- ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యుల నియామకం
- ప్రజలు సేవలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి
- జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్

**మంథని, జులై 28, ( జనంసాక్షి):**
మంథని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఇకపై 24 గంటల పాటు ప్రసూతి, చిన్నపిల్లల వైద్య సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండనున్నాయని పెద్దపల్లి జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఇటీవల నిర్వహించిన వైద్యుల నియామకాల్లో భాగంగా మంథని సీహెచ్‌సీకి ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులను నియమించినట్లు తెలిపారు.



### నియమితులైన స్పెషలిస్ట్ వైద్యులు

డా. మామిడిపల్లి స్రవంతి, గైనకాలజిస్ట్, డా. గుంట మౌనిక, అనస్తీషియా స్పెషలిస్ట్, డా. నరేష్, పీడియాట్రిషన్ ఈ నియామకాలతో మంథని సీహెచ్‌సీలో ప్రసూతి సేవలు, నవజాత శిశువులు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు ఇకపై ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. మంథని నియోజకవర్గం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ మెరుగైన వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన, ఉచిత వైద్య సేవలను పొందాలని డా. కె. శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

## కొత్తపల్లి రైతు వేదికలో ఘనంగా 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్

### ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

**కొత్తపల్లి, జూలై 28, ( జనం సాక్షి)**
కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల రైతు వేదికలో "రైతు నేస్తం" 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు అవకాశాలు, లాభసాటి పంటల ఎంపిక తదితర అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి భాగ్య లక్ష్మి ప్రస్తుత పరిస్థితుల్లో సాగు చేయదగిన ప్రత్యామ్నాయ పంటలు, పంటల యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ సూచనలపై రైతులకు వివరించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ కోఆర్డినేటర్ డా.



పి. మధుకర్ రావు ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, నేల తేమ సంరక్షణ, నీటి యాజమాన్యం, సమయానుకూల విత్తనం, మండలానికి అనుగుణమైన కాంటింజెన్సీ క్రాప్ ప్లానింగ్‌పై అవగాహన కల్పించారు. డీహెచ్‌ఎస్‌ఓ జగన్ మోహన్ రెడ్డి ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై వివరించగా, ఏడీఏ రణధీర్ లాభసాటి పంటల సాగు, మార్కెట్ అవకాశాలు, పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు జి. మోహిని, ఎస్. భూమారావు, రాజ శేఖర్‌తో పాటు ఏఈఓలు వంశీ, గోపిచంద్‌లను సన్మానించారు. అనంతరం విత్తన మేళా రెండో రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మండల వ్యవసాయాధికారి సంతోష్, హార్టికల్చర్ అధికారి స్వాతి, ఏఈఓలు ఫజిల్, రాజశేఖర్, ఫరీద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పాటు:హుజురాబాద్ ఏసిపి మాధవి

**వీణవంక జులై 28(జనం సాక్షి)**
వీణవంక నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పడతాయని ఒక్క సీసీ కెమెరా వెయ్యి మంది పోలీసులతో సమానమని హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్థుల సహకారంతో సుమారు ఒక లక్ష 70,000 రూపాయలతో 8 సీసీ కెమెరాలు స్థానిక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్ఐ ఆవుల తిరుపతి మల్లారెడ్డిపల్లె సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ తో కలిసి మంగళవారం సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసిపి మాధవి,మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని,ఇప్పటికే పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గ్రామాలలో నేరం జరిగినపుడు దాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పెద్ద పెద్ద నేరాలను కూడా సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహక



రించిన గ్రామస్తుల దాతలందరినీ ఈ సందర్భంగా అభినందించారు. సీసీ కెమెరా లను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని కాపాడుకో వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అనంతరం హుజురబాద్ ఏసిపి మాధవి కు మల్లారెడ్డిపల్లె గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ పూల బోకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ లకు హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ ఘనంగా సన్మానించారు. ఇట్టి సిసి కెమెరాలను గ్రామంలో పెట్టించేందుకు సహకరించిన హెడ్ కానిస్టేబుల్ మోహన్ కు హుజరాబాద్ ఏసిపి మాధవి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో సహకరించిన దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలిపాక రజితశ్రీనివాస్, ఉప సర్పంచ్ అరసం శ్రీనివాస్,పాలకవర్గ సభ్యులు కర్రె నాని,సుజాత కృష్ణ,కర్రె కొమురయ్య, గంధం ప్రశాంత్,కిన్నెర మల్లేష్, పంచాయత్ కార్యదర్శి సందీప్, గ్రామస్థులు దూలం సురేష్,బండారి రవి,గోనెల పెద్దలు,ఆర్షం సాయి, బండారి సందీప్,కర్రె శ్రీనివాస్, ఓంకార్, కనుకయ్య, సదయ్య,సంపత్, నరేష్,రమేష్,పూదరి కుమార్, తోపాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంథనిలోనే కొనసాగించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కు వినతి

**మంథని, జులై 28, (జనంసాక్షి) :**
వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంథని లోనే కొనసాగించాలని కోరుతూ మంగళ వారం వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో మంథని రెవిన్యూ డివిజినల్ అధికారి సురేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ.. మంథని లో నిర్వ హించబడుతున్న వ్యవసాయ శాఖ కార్యాల యాన్ని మంథని మండలం సూరయ్య పల్లి గ్రామంలోని రైతు వేదికలోకి మార్చడం సరికాదని అన్నారు. ఇప్పటికే మంథని లో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రానికి తరలించారని, ఇప్పుడు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని శిథిలావస్థలో ఉన్నదని కారణంతో పక్క గ్రామానికి తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము అని అన్నారు. రైతులు పనుల నిమిత్తం 3 కిలోమీటర్లు వెళ్ళాల్సిన పరిస్థితి ఉన్నదని మండలంలోని అనేక గ్రామాలనుండి వచ్చే రైతులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రాన్ని విస్మరించి పక్క గ్రామానికి తరలించడం ఎంతవరకు సమజసం అని ప్రశ్నించారు. మండలంలోని 35 గ్రామాల నుండి ఆఫీస్ అడ్రస్ తెలియక గందర గోలానికి గురి అవుతున్నారని అన్నారు. ఆర్డిఓ కార్యాలయం తో పాటు వివిధ శాఖల కార్యాలయాన్ని అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి అని, వ్యవసాయ శాఖా కార్యాలయాన్ని పక్క గ్రామానికి తరలించడం ఏమిటి అని రైతులు అంటే అంత చిన్న చూపు ఎందుకు అని మండి పడ్డాడు. రైతుల సంక్షేమాన్ని, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ



శ్రీధర్ బాబు దృష్టి సారించి తరలించిన కార్యాలయాన్ని మంథనిలో పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖా కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి ఏల్పుల సురేష్, వ్యవసాయ శాఖా కార్మిక సంఘం జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు బావు రవి, నాయకులు మంథని కిష్టస్వామి ఉప్పు రమేష్, ఇరుగురాల ప్రసాద్ పాల్గొన్నారు.

జనంసాక్షి



# గోడ గడియారాల ఆవిష్కరణ

**పెద్ద కొడప్గల్ జూలై 28 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేసే గోడ గడియారాలను మండల ప్రత్యేక అధికారి బలరాం స్థానిక అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జూన్ 2వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం గోడ గడియారాలు బహుమతిగా ఇస్తున్నట్లు హౌసింగ్ ఏఈ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంపీఓ లక్ష్మీకాంత్ రెడ్డి, సర్పంచ్లులు ఉన్నారు.

## పాము కాటుకు విరుగుడు మందు 108 లో లేదు

### మండల వైద్యాదికారి అఫీజా



**ముస్తాబాద్ జూలై 28 (జనంసాక్షి)**
పాము కాటుకు విరుగుడు మందు స్నేక్ వినమ్ అంటీ సీరమ్ అనే మందు 108 లో లేదని,108 కి ఫోన్ చేస్తే స్వయంగా ఇంటికి వచ్చి పాము కాటుకు విరుగుడు మందు స్నేక్ వినమ్ ఆంటీ సీరం అనే ఇంజక్షన్ ఇచ్చే సదుపాయం అందు బాటులో లేదని,ఈ మధ్య వాట్సఅప్ గ్రూపు లలో దుష్ప్రచారం చేస్తున్నారు.ఈలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని,ముస్తాబాద్ మండల వైద్యాధికారి అఫీజా తెలిపారు.ప్రభుత్వం నుండి అలాంటి వైద్య సేవలు అందించే సదుపాయం వుంటే తెలియజేస్తామని అన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు, జల సంరక్షణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 29 (జనంసాక్షి)**
రైతుల ఆదాయాన్ని పెంచడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం విజయవంతంగా 100 ఎపిసోడ్‌లను పూర్తి చేసుకుని ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తూ వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతోంది.రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు కమిషనర్ అండ్ అగ్రికల్చర్ డైరెక్టర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కామారెడ్డి జిల్లా దోమకొండ రైతు వేదికలో వరి ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది కూడా వర్షపాతం తగ్గే అవకాశం ఉందని శాస్త్రీయ అంచనాలు సూచిస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా తక్కువ నీటితో సాగయ్యే లాభసాటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు
వరి పంట అధిక నీటి వినియోగంతో కూడుకున్నందున వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు, జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల పెసర్లు, కందులు, మినుములు, నూనెగింజల పంటలు, కూరగాయలు, ఉద్యానవన పంటలు తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయంతో పాటు పంట భద్రతను కూడా పొందవచ్చని పేర్కొన్నారు.జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో రైతులు, ప్రజాప్రతినిధులు నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను పునరుద్ధరించవచ్చని తెలిపారు.ప్రతి గ్రామ పంచాయతీ, మండలానికి పంట కుంటల నిర్మాణ లక్ష్యాలు నిర్దేశించామని, రైతులు తమ పొలాల్లో సుమారు 1212 మీటర్ల విస్తీర్ణంలో పంట కుంటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు.
వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపికైన ముగ్గురు ఉత్తమ రైతులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలు) కూడా శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఇతర రైతుల్లో అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించిన రైతులను, కార్యక్రమంలో పాల్గొన్న కవులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## అన్ని గ్రామాల ఇసుక ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వాలి

**ముస్తాబాద్ జులై 28( జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలములోని తుర్కపల్లి గ్రామములో ఉన్న ఇసుక రిచ్ నుండి అన్ని గ్రామాల ట్రాక్టర్ లకు ఇసుక పర్మిషన్ ఇవ్వాలని ముస్తాబాద్, పోతుగల్, చికొడ్,నామాపూర్,చిప్పలపెల్లి గ్రామాల ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మంగళవారం మండల తహసిల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఫారూఖ్ కు వినతిపత్రం అందజేశారు.తుర్కపల్లె గ్రామములో ఉన్న ఇసుక రిచ్ నుండి గతములో ఇసుక ట్రాక్టర్ల కు ఏవిధముగా అనుమతులు ఇచ్చారో అదే మాదిరి అనుమతులు ఇవ్వాలని మండల ట్రాక్టర్ యునీయన్ నాయకులు కంపెల్లి శ్రీనివాస్ అన్నారు.మండలములో మానేరు వాగు అనేది కేవలం తుర్కపల్లె,అవునూర్ రామాలక్ష్మణ పల్లె గ్రామాలకే పరిమితం కాదు,ఆ గ్రామాల్లో ఉన్నంత మాత్రాన ఆ గ్రామాలకు చెందినది గా భావించడం సరి కాదని కంపెల్లి శ్రీనివాస్ కోరారు.మండలములోని 22 గ్రామాలకు ఇసుక. ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వాలి.అది కాకుండా కేవలం అవునూర్,తుర్కాపల్లె,రామా లక్ష్మణ పల్లె గ్రామాలకు ఇసుక అనుమతులు ఇస్తే ట్రాక్టర్ లను అడ్డుకుంటామని మండల ట్రాక్టర్ యూనియన్ నాయకులు అన్నారు.ఈ కార్యక్రమములో ట్రాక్టర్ యూనియన్ నాయకులు చెల్లపురం మహేందర్ రెడ్డి,చెంద్రం,నర్సింలు,తాళ్ళ శేఖర్ రెడ్డి,కొమురయ్య,ట్రాక్టర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు జలపతి రెడ్డి

**కథలాపూర్ జూలై 28 (జనం సాక్షి )**
కథలాపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస్అభియాన్ కార్యక్రమం మండల అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఇంచార్జిగా కిషాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి జలపతి రెడ్డి విచ్చేసిన సందర్భంగా శాలువాతో సన్మానించి అనంతరం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు మండల పదాధికారులు జిల్లా బాధ్యులు మరియు సీనియర్ నాయకులతో వారు ఎస్ ఐ ఆర్ గురించి చర్చించడం జరిగింది ఆ తర్వాత కొన్ని బూతులకు వెళ్ళి బి యల్ ఏ లను కలిసి కార్యక్రమ సరళిని తెలుసుకొని మండలానికి సంబందించిన పూర్తి రిపోర్ట్ సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి,సీనియర్ నాయకులు గాందారి శ్రీనివాస్,బీజేవైఎం అధ్యక్షులు ఆరే శివ,తోకల వినోద్,కంటే రాజం, కల్లెడ ప్రసాద్, కల్లూరి అంజయ్య పాల్గొన్నారు.





## నేరెళ్ల గ్రామానికి టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత రాక..

### గంభీరావుపేట నుంచి మహిళా నాయకుల తరలింపు..

**గంభీరావుపేట జూలై 28 (జనం సాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత పరామర్శ నిమిత్తం విచ్చేస్తున్న సందర్భంగా గంభీరావుపేట మండల టీఆర్ఎస్ నాయకులు కూర సురేష్ పటేల్ ఆధ్వర్యంలో మండలం నుంచి మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నేరెళ్ల గ్రామానికి తరలివెళ్లారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఇసుక లారీలు అడ్డుకున్నందుకు గత ప్రభుత్వం అడ్డుకున్న వారిని చిత్రహింసం చేసి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా నాయకులు, కార్య కర్తలు ఉత్సాహంగా పాల్గొని పార్టీ పట్ల తమ సంఘీభావాన్ని చాటారు.

## రత్నాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బర్ల శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



**రామగిరి, జూలై 28, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన రత్నాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బర్ల శ్రీకాంత్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్ కండువా కప్పుకొని అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మట్ట రాజ్ కుమార్, రత్నాపూర్ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులు ప్రజా ప్రతినిధులు, మహిళలు గ్రామ శాఖ అధ్యక్షులు రత్నాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా మంత్రి శ్రీధర్ బాబు

**రామగిరి, జూలై 28,(జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన నక్క నరేష్ కు లక్ష రూపాయల ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. నరేష్ నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా



వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి లక్ష మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు మంగళవారం వారికి ఎల్ఓసి మంజూరు కాపీని హైదరాబాద్ లో అందజేశారు. ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు సదరు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇంకుడు గుంత నిర్మాణాలలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి:డిఆర్డీవో పిడి సాయన్న

**ఎడపల్లి, జూలై 28 ( జనంసాక్షి ) :**
ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృశ్య దృష్ట్యా ప్రతి ఒక్క ఇంటిలో ఇంకుడు గుంత నిర్మాణాలను చేపట్టాలని ఇందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపి వంద శాతం నమోదు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఓ పిడి ఎడపల్లి మండల ప్రత్యేక అధికారి సాయన్న కోరారు. ఈ మేరకు ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులతో జలసిరిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షపాతం నమోదు తక్కువగా ఉంటుందనే విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే అన్నారు. అయితే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకుడు



గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలను ఏర్పాటు చేసే విధంగా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటిని నిర్మాణాలకు ప్రభుత్వము నిధులను సైతం అందిస్తుందని అందువల్ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని వచ్చే సీజనల్



వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని పిడి సాయన్న కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ దత్తాద్రి, ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో మన్మోహన్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# రైతు వేదికలలో విత్తన మేళా రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు

**కథలాపూర్ జూలై 28 (జనంసాక్షి)**
కథలాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మరియు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు సందర్శించారు వివిధ రకాల విత్తనాలు ( కుసుమలు, పెసర్లు, అనుములు, కందులు, అలసంద మొక్కజొన్న, ఉల్లి, కూరగాయలు) గురించి అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి యోగిత కందులు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వివరించడం జరిగింది. ఈ వానాకాలం ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురుస్తాయి అని వాతావరణ శాఖ వారు చెప్పడం వలన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ కాంటీన్జెన్సీ ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఈ ప్రణాళికలో భాగంగా ఆరుతడి పంటలు అయినటువంటి కంది, పెసర, మినుము, కుసుమ, అలసంద, అనుములు, కూరగాయలు వంటి పంటలను రైతు సోదరులు వేయాలని ప్రభుత్వం సూచించడం జరిగింది ఈ సూచనలో భాగంగా రైతు వేదికలలో విత్తనమేలాను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారీ మదన్ మోహన్,అలాగే మండల వ్యవసాయ అధికారి యోగితా మేడం, అలాగే మండల పంచాయతీ అధికారి ఎంపీవో అలాగే వివిధ గ్రామాల సర్పంచులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు హరీష్,సంధ్య ,మౌనిక,సుష్మ శ్రీ, రాఘవేంద్ర మరియు విత్తన డీలర్లు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# రైతు వేదికలలో విత్తన మేళా

## రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు

**చిగురుమామిడి జులై 28(జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి రైతు వేదికలో విత్తనమేల రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ గారు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించడం జరుగుతుంది.ఎల్నినో కారణంగా తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరడం జరిగింది.ఇందుకు గాను రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విత్తన మేళాలో పేసర్లు,కందులు, మొక్కజొన్న విత్తనాలు, అందుబాటు లో ఉంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి జంగా శిరీష రమణ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి గారు వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మహిళలతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం

## మంగళ్ పాడ్ సర్పంచ్ చేపూరు వీణ శ్రీనివాస్ గౌడ్

ఎడపల్లి, జూలై 28 ( జనంసాక్షి ) :
మహిళలతోనే గ్రామ అభివృద్ధి సాధ్యపడుతుందని అందువల్ల మహిళా సంఘాలు చైతన్యంతో గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని మంగళ్ పాడ్ సర్పంచ్ చేపూరు వీణ శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మహిళా గ్రామసభలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అందువల్ల దాని నివారించేందుకు ప్రతి ఒక్కరి ఇంటిలో ఇంకుడు గుంతను నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంత, పంట కుంటలు, ఊట కుంటలను నిర్మించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన నీటిని అందించే విధంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అందువల్ల మహిళలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా దీనిని పూర్తి చేయాలని ఆమె కోరారు.
గ్రామంలో పారిశుద్ధ్య నిర్మూలనలో మహిళల పాత్ర ప్రత్యేకంగా చూపించాలని అందులో భాగంగా చెత్తను వేరు చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయకుండా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలను సైతం మహిళలు చెప్పాల్సిన అవసరం ఉందని సర్పంచ్ చేపూరు వీణ శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబన్న, పంచాయతీ కార్యదర్శి అలీ, చేపూరు శ్రీనివాస్ గౌడ్, గ్రామ సంఘం అధ్యక్షురాలు, మహిళలు పాల్గొన్నారు.



# రామగిరిలో విషాదం..

## ఇంట్లో ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

రామగిరి, జూలై 28 **జనంసాక్షి :**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నవాబ్ పేట్ గ్రామంలోని బుడగ జంగం కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. బోడకుర్తి సుజాత (22) అనే యువతి మంగళవారం ఇంట్లో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం మేరకు, తల్లిదండ్రులు ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో



ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అనంతరం కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చూడగా యువతి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న రామగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువతి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులుతెలిపారు.

# డ్రై డే కార్యక్రమాలను పర్యవేక్షించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

**వేములవాడ, జులై 28 (జనంసాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల హాస్టల్‌ను జిల్లా వైద్య ,ఆరోగ్యశాఖ అధికారి డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఏంజెలాస్ట్రైడ్ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, వంటశాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, సబ్బుతో చేతులు కడుక్కోవడం, సురక్షితమైన తాగునీటిని మాత్రమే వినియోగించడం, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి శుభ్రపరచాలని సూచించారు.డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు, నీటి డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ డ్రై డే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని డాక్టర్ ఏంజెలాస్ట్రైడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక హెల్త్ సూపర్ వైజర్, ఆశా కార్యకర్తలు, ఏ ఎన్ ఎం లు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

## కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం

**శంకరపట్నం జూలై 28 జనం సాక్షి:**
గ్రామపంచాయతీల్లో ఉపసర్పంచ్‌లకు చట్టబద్ధమైన హక్కులు, అధికారాలు కల్పించి వారి పాత్రను మరింత బలోపేతం చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు.జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఉప సర్పంచులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ను కలిసి ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామాభివృద్ధిలో వారి పాత్ర, అధికారాల అమలుకు సంబంధించిన పలు అంశాలను వివరించారు.వినతిపత్రంలో ప్రధానంగా నాలుగు కీలక డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉపసర్పంచ్‌లకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం, వార్డ్ సభ్యులకు రూ.3వేల గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరారు. గ్రామపంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, సంబంధిత వార్డ్ సభ్యుల పేర్లను కూడా తప్పనిసరిగా ముద్రించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే గ్రామ పంచాయతీ స్టాండింగ్ కమిటీలలో ఉపసర్పంచ్‌లను వైస్ చైర్మన్‌లుగా నియమించి వారికి తగిన బ్యాతలు అప్పగించాలని, గ్రామపంచాయతీ తీర్మానాలు అమల్లోకి రావడానికి ఉపసర్పంచ్‌ల సంతకాలను కూడా తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యల



పరిష్కారంలో ఉపసర్పంచ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, చట్టపరంగా ఉన్న అనేక హక్కులు అమలులోకి రావడం లేదని నాయకులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ఉపసర్పంచ్‌లకు తగిన గుర్తింపు, అధికారాలు, గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దుస్స కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ గౌడ్‌తో పాటు కరీంనగర్ జిల్లాలోని వివిధ మండలాల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుపై బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

**- విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి - వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**

**వేములవాడ, జులై 28 (జనంసాక్షి):**
వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి,వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్‌ను,వారికి కేటాయించిన కిట్ ఆర్టికల్స్ ని పరిశీలించారు.అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి,పెండింగ్‌లో ఉన్న కేసులను సమగ్రంగా సమీక్షిస్తూ, విచారణలో ఉన్న కేసుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు,నేరాల స్థితిగతులపై సవివరంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రతను కాపాడాలని,ఫైళ్లను క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచాలని,ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని , విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సూచించారు.పోలీస్ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు , సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. విలేజ్ పోలీసింగ్ లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తరచూ గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తు ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని,అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు.వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్టేషన్ పరిధిలో, ముఖ్యంగా దేవాలయ పరిసరాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్ఠంగా అమలు చేస్తూ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ట్రాఫిక్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల,రౌడి షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, వారి కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని,చట్టవ్యతిరేక కార్యక్రమాలైన గంజాయి , పేకాట,పిడియాస్ రైస్, మొదలగు




వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో డిఎస్పీ, సి.ఐ, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ వీరప్రసాద్, ఎస్.ఐ లు ప్రేమనందం, శ్రీనివాస్, ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ రాజు, సిబ్బంది ఉన్నారు



## గురుపౌర్ణమి పర్వదినాన కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వరాలయం, బాసర, కాళేశ్వరం, ధర్మపురి కొండగట్టు ఆలయాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నేడు ఉదయం 5 గంటలకు ప్రారంభం కానున ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో భాగంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఒక భరోసా ఇవ్వాలని కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణ ప్రాముఖ్యత అందరికీ తెలియాలనీ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే ఒక మంచి ఉద్దేశంతో ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందని దైవంశపరమైన ఈ కార్యక్రమాన్ని రాజకీయాలకు దూరంగా కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగా మాత్రమే చూడాలి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భక్తులందరూ భాగస్వాములు కావాలని వేడుకుంటున్నాను. నారాయణ పూర్ రిజర్వాయర్ పనులు 90% పూర్తయ్యాయి, కొంతమంది ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని ప్రయత్నించారని, ప్రాజెక్టు పూర్తి అయితే కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేకు పేరు వస్తుందని కొంతమంది ఉద్దేశ పూర్వకంగా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దుశలవారీగా నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని అసెంబ్లీలో పలుమార్లు విన్నవించడం జరిగింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఎన్ని ఇండ్లు ముంపునకు గురయ్యే అవకాశం ఉంటే అన్ని ఇండ్లకు పరిహారం అందిస్తాం అని, గత ప్రభుత్వం సెలెక్ట్ చేసిన 40 ఇండ్లకు గత ప్రభుత్వము ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. మేమే వారికి పరిహారం ఇప్పించామన్నారు. . ఈ పత్రిక విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, చొప్పదండి సహకార పరపతి చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, గంగన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 100వ వారంలోకి అడుగుపెట్టిన రైతు నేస్తం కార్యక్రమం విజయవంతం చేయాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- 99 వారాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న రైతు నేస్తం కార్యక్రమం**
**- ఉత్తమ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులను సన్మానించిన జిల్లా కలెక్టర్**
**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు, రైతులు**
**- రైతు నేస్తం 100వ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి,జూలై 28(జనంసాక్షి) :**
రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల నిర్వహణపై నిరంతర అవగాహన కల్పిస్తున్న లిలిరైతు నేస్తం కార్యక్రమంలిలి విజయవంతంగా 99 వారాలు పూర్తి చేసుకుని 100వ వారంలోకి అడుగుపెట్టడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.మంగళవారం పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ రైతు వేదిక లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన రైతు నేస్తం ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ రైతులకు ప్రతి వారం వ్యవసాయ నిపుణుల ద్వారా అందుతున్న సూచనలు వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయని అన్నారు. రైతులు శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి లిలితుమ్మల నాగేశ్వరరావులిలి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లిలిసంజయ్ జాజూలిలి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి లిలిసురేంద్ర మోహన్‌లిలి, వ్యవసాయ శాఖ సంచాలకులు లిలిగోపీలిలి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లాలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులను జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు అందించి సన్మానించారు.

- సన్మానం పొందిన రైతులు :
- మాదాసు భూమయ్య, పాలకుర్తి గ్రామం, పాలకుర్తి మండలం – బహుళ పంటల సాగులో ప్రతిభ కనబరిచిన రైతు.
- జునేని శ్యాంసుందర్ రావు, శివపల్లి గ్రామం, ఎలిగేడు మండలం–ఆయిల్‌పామ్ సాగులో ఉత్తమ రైతు.
- గుర్రాల రాజయ్య, గుండారం గ్రామం, కమాన్‌పూర్ మండలం –ఆయిల్‌పామ్‌తో పాటు కాజురినా అంతర పంటల సాగులో ఆదర్శ రైతు.
- సన్మానం పొందిన వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏ ఇ ఓ లు):
- ఎం. ఈశ్వర్ రెడ్డి – ఏఈఓ, శ్రీరాంపూర్.
- ప్రత్యూష – ఏఈఓ, మంథని. అనంతరం పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో నూతనంగా నిర్మించబోయే జిల్లా కోర్టు భవన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.లిఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, అదనపు సంచాలకులు శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారి నాగార్జున, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని భవిష్యత్తు కోసం ఎక్స్‌ప్లోరికా పాఠశాల విద్యార్థుల పర్యావరణ ర్యాలీ - మొక్కల పంపిణీ

**ఎక్స్‌ప్లోరికా పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు**

**కరీంనగర్ బ్యూరో, జూలై 28 ( జనంసాక్షి)**
ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా పాఠశాల 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులు ప్రకృతి పరిరక్షణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు “ప్రకృతిని కాపాడుదాం – భావితరాలను రక్షిద్దాం”, “ఒక్క మొక్క – వెయ్యి ప్రాణాలకు ఆధారం” వంటి నినాదాలతో జ్యోతినగర్ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పై చైతన్యం కల్పించారు. ర్యాలీలో భాగంగా విద్యార్థులు స్థానిక జ్యోతినగర్ నివాసితులకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వృక్షాల పెంపకం, ప్రకృతి వనరుల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్స్‌ప్లోరికా పాఠశాల చైర్మన్ డా. ఈ. ప్రసాద్ రావు మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. విద్యార్థులు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీ, మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించా లని, ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు పచ్చని,




ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చని పాఠశాల యాజమాన్యం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్లోరికా పాఠశాల చైర్మన్ డా. ఈ. ప్రసాద్ రావు , డైరెక్టర్లు అనూకర్ , వి.యు.ఎం. ప్రసాద్ , ప్రసూన , ప్రాచి , రాకేష్ , రష్మిత , ప్రిన్సిపాల్ శర్మిష్ఠ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల అరెస్టు

**-25,020 రూ నగదు,5 సెల్‌ఫోన్లు,3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**సుల్తానాబాద్,జూలై 28(జనంసాక్షి) :**
విశ్వసనీయ సమాచారం మేరకు చిన్న బొంకూర్ గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ పక్కన గల ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు మూడు పేకాట (తీన్ పట్టి) ఆడుతూ డబ్బులతో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో, సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి దాడి నిర్వహించారు. దాడిలో పూసాల గ్రామానికి చెందిన నిమ్మల అనిల్,చొప్పరి రాకేష్,చొప్పరి రాజు,కొమ్ము శ్రీకాంత్ ,పూసాల సాంబమూర్తి అనే ఐదుగురు వ్యక్తులు మూడు ముక్కలాట ఆడుతూ నగదుతో జూదం నిర్వహిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి రూ.25, 020/- నగదు, 52 పేకముక్కలు, 5 మొబైల్ ఫోన్లు,3 మోటార్ సైకిళ్లను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.నిందితులు ఐదుగురిపై తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు తెలిపారు.ఈ సందర్భంగా సిఐ రంజిత్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే పోలీసువారికి సమాచారమివ్వాలని రంజిత్ రావు తెలిపారు.



## ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు భూ రీ-సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**- డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు**

**- ఎస్ఐఆర్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**



**పెద్దపల్లి,జూలై 28(జనంసాక్షి) :** జిల్లాలో రెవెన్యూ సేవలు, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం శాంతినగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా భూ రీ-సర్వే ప్రక్రియను నాణ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అందించే మీసేవ ధ్రువపత్రాలను నిర్ణీత గడువులో జారీ చేయడంతో పాటు, భూ భారతి దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా సాదా బైనామా దరఖాస్తుల విషయంలో ప్రతి దరఖాస్తుదారునికి తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.అనంతరం శాంతినగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలను అవసరమైన వివరాలతో సేకరించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి, ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో తహసీల్దార్ రాజయ్య,రెవెన్యూ అధికారులు,బీఎల్‌వోలు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ**

**- జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్**

**పెద్దపల్లి,జూలై 28(జనంసాక్షి) :** తెలంగాణ సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే గుర్తించి, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు దబ్బడి చంద్రకళ,జిల్లా ఉపాధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు.పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 2001 నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో తాము పడిన కష్టాలను,ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేశారు. ఆనాడు జైలు జీవితాలు గడుపుతూ, కుటుంబాలను పోషించుకోలేక, పశువులు మరియు ఇళ్లలోని మూగజీవాలు చనిపోయే దయనీయ పరిస్థితుల్లోనూ సొంత నగలు అమ్ముకొని ఉద్యమాన్ని కొనసాగించామని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యమకారులను ఆదుకుంటామని,జార్ఖండ్ రాష్ట్రం మాదిరిగా పింఛన్లు, ఇళ్లు, 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి తదితరులు ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీలు ఇచ్చారని వారు గుర్తుచేశారు. ఆ మేనిఫెస్టో హామీలను నమ్మే తాము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ,ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కేకే అధ్యక్షతన శోభన్ రెడ్డి,రాములు నాయక్,పొన్నం ప్రభాకర్,అద్దంకి దయాకర్ తదితరులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమే అయినప్పటికీ,ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని కోరారు.ప్రస్తుతం అనేక మంది ఉద్యమకారులు పూట గడవని దుస్థితిలో ఉన్నారని,రాబోయే పండుగల నాటికి ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు తక్షణమే గుర్తింపు కార్డులు అందజేసి,ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలోతెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ ఖతీజా,ఆలేటి ఎల్లమ్మ,గడ్డం లక్ష్మి,మొలుగూరి నర్సయ్య,పెర్క రాయమల్లు,ఈదునూరి శంకర్,బోసేలి శాంత,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే మా లక్ష్యం

**- సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక చర్యలు**

**- డ్రైనేజీ పూడిక తీత పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ**



**సుల్తానాబాద్,జూలై 28(జనంసాక్షి) :** ప్రజల భద్రతే మా లక్ష్యమని, వర్షకాలం దృశ్య సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు డ్రైనేజీ పూడిక తీత పనులు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పదవ వార్డు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి మూలమలుపు తహసిల్దార్ కార్యాలయం వరకు మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ పదవ వార్డు కౌన్సిలర్ అంతటి పుష్పలత తో కలిసి సైడ్ డ్రైనేజ్ పూడిక తీత పనులను జెసిబి తో ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదురాధాకృష్ణ, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ వ్యాపారులకు పలు సూచనలు చేశారు. డ్రైనేజీలో చెత్త వ్యర్థ పదార్థాలను వేయవద్దని సూచించారు. ముఖ్యంగా హోటల్ యజమానులు కూడా వ్యర్థపదార్థాలను డ్రైనేజీలలో వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి మున్సిపల్ వాహనాలలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, వార్డు కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ పనులు వేగవంతం చేయండి

**- నాలుగవ వార్డులో ఎస్ ఐ ఆర్ పనులు సందర్శించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,కమిషనర్ తిప్పరాజు రమేష్**

**సుల్తానాబాద్,జూలై 28(జనంసాక్షి) :** ఎస్ ఐ ఆర్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ఎస్ ఐ ఆర్ పనులను నాలుగో వార్డులో క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో 100% ఎస్ ఐ ఆర్ జరిగే విధంగా త్వరితగతిన ఫారాలను నింపి మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు ఎస్ఐఆర్ పై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బి ఎల్ వో లు, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి దిశా దశ నిర్దేశం చేశారు. ఐదు రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంతో ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ 100 శాతానికి చేరుకోవాలని వారు సూచించారు.

### బాలికల పాఠశాలలో ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలి

**- కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్**

**సుల్తానాబాద్,జూలై 28(జనంసాక్షి) :**



వర్షాకాలం దృష్ట్యా స్థానిక బాలికల ప్రభుత్వ పాఠశాలలో నీటి నిలువలు ఎక్కువ కావడంతో తద్వారా విద్యార్థినిలు దోమల బారినపడి డెంగ్యూ వంటి భయంకరమైన విష జ్వరాలు వస్తాయని, పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని మూడో వార్డు కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్ మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ దృష్టికి తీసుకువచ్చారు.స్పందించిన కమిషనర్ వెంటనే ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని తెలిపారని కందునూరి సమతా కుమార్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.131 కోట్ల విలువైన వైద్య సేవలు

**- 2 సంవత్సరాల కాలంలో రెండు వేల పై చిలుకు అర్థో సర్జరీలు**

**- రికార్డు స్థాయిలో 5 వేల డెలివరీలు - విప్ ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు**



**పెద్దపల్లి,జూలై 28(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు.ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా తనే పత్రి వార్డుకు కలియ తిరుగుతూ ప్రతి ఒక్కరిని కలుస్తూ వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 131కోట్ల విలువైన వైద్య సేవలను అందించడం జరిగిందని అలాగే ఆసుపత్రికి సంబందించి రూ.40 లక్షల రూపాయల వ్యయంతో వివిధ విభాగాలకు సంబందించి అత్యధునిక సామాగ్రిని వైద్య సేవల కోసం అందజేయడం జరిగింది అని కంటి శుక్లలు ముందు వెనుక భాగాలు పరీక్షించే అత్యధునిక పరికరాలు,ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని కొలిచే పరికరాలు,పంటి రూట్ కెనాల్ చేసే అత్యధునిక పరికరాలు,మోకాళ్ళ కీళ్ల మార్పిడి తొడ ఎముక కాళీ ఎముక పరికరాలు,ఆపరేషన్లో ఉపయోగపడే ఆత్యాధునికమైన ఎక్రే ఇమేజింగ్ పరికరాలు, నడుము మెడ నొప్పులను తగ్గించే అత్యాధికావైన పరికరాలు మరియు మోకాలు గుజ్జు అరగకుండా కండరాలు బ్రీత్ తగ్గించే పరికరాలు, చెవి వినికిడి సామర్థ్యం లెక్కించే యంత్రం చెవి ముక్కు గొంతు లోపలి భాగాలను పరీక్షించే యంత్రాలతో పాటు చర్మ వ్యాధులను పరీక్షించే అత్యాధునికమైన డేర్మ చైర్ అన్ని రకాల పరికరాలు మరియు చిన్న చిన్న పులిపిర్లు తొలగించే కాటన్ యంత్రం మరియు అన్ని రకాల యంత్రాలను రూ 40 లక్షల రూపాయల నిధులతో ఆసుపత్రిలో సమకూర్చడం జరిగింది అని అన్నారు. సంవత్సర కాలం నుండి దాదాపు 50 లక్షల రూపాయల వ్యయంతో 10 వార్మర్లు, 7 ఫోటో థెరపీ యూనిట్లు, 2 సిపాపు,1 వెంటిలేటుతో ఎస్ ఎన్ సి యును ప్రారంభించడం జరిగిందని తెలిపారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా మంత్రి శ్రీధర్ బాబు వారందరి సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి చేసుకోవడం జరిగింది.గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని కనీసం మాత్రంగా పట్టించుకోకుండా వైద్య సేవలు అందించకుండా నిర్వీర్యం చేశారని అన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలలో నంబర్ వన్ స్థానం రావడానికి కృషి చేసిన ఆస్పత్రి సూపర్డెంట్,ఆర్ఎమ్ఓ,హాస్పిటల్ సిబ్బంది కి క్రెడిట్ దక్కుతుందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్,హాస్పిటల్ అధికారులు, వైద్యులు, జిల్లా గ్రంధాలయం చెర్మన్,పెద్దపల్లి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు,పట్టణ కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు,సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# 700 కోట్ల అవినీతి



**గోదాం యజమానులతో ఎఫ్సీఐ అధికారుల కుమ్మక్కు**

- - ఈడి, సిబిఐ,కి ఫిర్యాదు చేస్తా
- అవినీతి అధికారుల భరతం పడతా
- ప్రభుత్వం ఏం చేస్తుంది. హైకోర్టులో రిట్ వేస్తా
- విలేకరుల సమావేశంలో బిజెపి సీనియర్ రాష్ట్ర నేత గొట్టిముక్కల సురేష్ రెడ్డి ధ్వజం

సుల్తానాబాద్,జూలై 28(జనంసాక్షి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీసం గిట్టుబాటు ధర కల్పించని నేటి రోజుల్లో ఏకంగా 2023 నుండి 2026 సంవత్సరం వరకు ఖరీఫ్,రబీ పంట కాలాలలో గోదాములకు కేటాయించిన దాన్యం లో దాదాపు 700 కోట్ల అవినీతి జరిగిందని, ఎఫ్ సి ఐ అధికారులు గోదాం యజమానులతో కుమ్మక్కై ఈ తతంగం నడిపించారని సీనియర్ బిజెపి రాష్ట్ర నేత గొట్టిముక్కల సురేష్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక ఎస్సార్ కళ్యాణ మండపంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొట్టిముక్కల సురేష్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లు యజమానులకు కష్టం మిల్లింగ్ ధాన్యం కేటాయింపుల్లో అధికారుల చేతివాటం ఎక్కువైందని ఆరోపించారు.బ్లాక్ లిస్టులో ఉన్నటువంటి రైస్ మిల్లులకు సీఎంఆర్ దాన్యం కేటాయించడం వంటి అంశాలు ఇందులో కీలకంగా మారాయని, వాస్తవంగా మిగతా రైస్ మిల్లర్లు ఎలాంటి బకాయిలు లేకున్నా, వారికి సీఎంఆర్ దాన్యం కేటాయించకుండా, బ్లాక్ లిస్టులో ఉన్నటువంటి రైస్ మిల్లులకు కేటాయించడం వల్ల అట్టి కష్టం మిల్లింగ్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని గొట్టిముక్కల సురేష్ రెడ్డి ఆరోపించారు.ఈ తతంగం అంతా అధికార పార్టీ నాయకుల ప్రోత్బలంతో జరుగుతుందని, కొంతమంది రైస్ మిల్లర్లు ఎఫ్సీఐ సివిల్ సప్లై అధికారులతో కుమ్మక్కై సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లాకు సంబంధించిన 25 గోదాముల కు దాన్యం కేటాయింపులు జరిపారని ఆరోపించారు. వాస్తవంగా అన్ని రైస్ మిల్లులకు ఎస్టేలు పంపించాల్సి ఉన్నా కానీ, కేవలం సంబంధిత అధికారులు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కొంతమంది ధనార్జనే ధ్యేయంగా ఇతర ప్రాంతాలకు కష్టం మిల్లింగ్ బియ్యాన్ని తరలించే వారికే ప్రాధాన్యత ఇవ్వడంతో, మిగతా రైస్ మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సురేష్ రెడ్డి ఆరోపించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అండదండలతో రైస్ మిల్లుల, గోదాముల ఓనర్లు సంబంధిత అధికారులు అంతా కలిసి ఇట్టి అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గొట్టిముక్కల సురేష్ రెడ్డి ఆరోపించారు. ఎఫ్ సి ఐ నిధులు గోల్మాల్ చేస్తూ, అధికారులు వందల కోట్లు దండుకుంటున్నారని దీనిపై సిబిఐ అధికారులకు, ఈ డీ ని ఆశ్రయిస్తున్నట్లు సురేష్ రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులు కనీసం సమాచారం అడుగితే, ఇవ్వకుండా, తనను అధికార ప్రజాప్రతినిధులతో భయభ్రాంతులకు బెదిరింపులకు పాల్పడుతున్నారని, కానీ తాను భయపడే ప్రసక్తి లేదని సురేష్ రెడ్డి పేర్కొన్నారు. తన వద్ద ఈ అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయని, ఓదెల మల్లన్న దేవాలయం వద్ద త డి బట్టలతో నిరూపించటానికి సిద్ధంగా ఉన్నానని, తేదీ సమయం చెప్పాలని బిజెపి రాష్ట్ర నేత గొట్టిముక్కల సురేష్ రెడ్డి సవాల్ విసిరారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు ఇంత తతంగం అవినీతి జరుగుతున్నా, రైతులు నష్టపోతున్న ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి అవినీతి అధికారులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు రారాజు ఎలా అవుతాడో ఎమ్మెల్యే విజయ రమణారావు తెలుపాలని గొట్టిముక్కల సురేష్ రెడ్డి సవాల్ విసిరారు. ఎఫ్సీఐ సివిల్ సప్లై అధికారుల అవినీతి బాగోతం, దందాలు ,బయట పెట్టేంత వరకు విడిచిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. అవినీతి అధికారుల అండదండలతో గోదాం నిర్వాహకులు కోట్లకు పడగలు ఎత్తుతున్నారని సురేష్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుండి గోదాముల వరకు వడ్ల గింజ నుంచి బియ్యం గా మారే వరకు అడుగడుగునా అవినీతి అడ్డగోలుగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఒక్కో ఎస్కె లారీ మీద రైతుకు 18 వేల రూపాయల నష్టం జరుగుతుందని, ఇంత దోపిడీ జరిగినా,సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని అన్నారు. సీఎంఆర్ ధాన్యాన్ని అన్లోడ్ చేయకుండా, గోదాం యజమానులు చూసి చూడనట్లు వ్యవహరించిన, సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర నేత గొట్టిముక్కల సురేష్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవినీతి, రైస్ మిల్లులు గోదాములలో కోకొల్లలుగా జరుగుతుందని, ఇట్టి అవినీతిపై సంబంధిత, విజిలెన్స్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లాలో రైతులకు జరుగుతున్న అవినీతి అక్రమాలపై న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయిస్తానని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, కాసగొని నిర్మల, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు రఫిక్, ఎస్ టి మోర్చా అధ్యక్షులు అరుణ్ రంజా, కొల్లూరి సంతోష్, బందారి లత, మెండే శంకరయ్య, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మల్ల భాగ్యలక్ష్మి, ఊషణ వేణి అన్వేష్, పేరుక రమేష్, ఏనుగు రాజిరెడ్డి, మారం రమేష్, దాసరి వెంకటేష్, నల్లవెల్లి శంకర్, వడ్లకొండ శశివర్ధన్, దాసరి చందు, వీరగోని కిరణ్, కొత్తూరు సంపత్, రమేష్ గౌడ్, శేఖర్ మాస్టర్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.



**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..మెషిన్ లెర్నింగ్‌లో**

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి..

**- కార్యశాల ప్రారంభ సమావేశంలో ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా..**

**గోదావరిఖని, జనంసాక్షి:**

ఏఐ యుగంలో సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అధ్యయనం చేస్తూ తద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల విద్యా స్వావలంబన కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాతవాహన యూనివర్సిటీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పైథాన్ ద్వారా ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై ఏర్పాటు చేసిన మూడు రోజుల వర్క్‌షాప్ 28న కంప్యూటర్స్ డిపార్ట్మెంట్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో సమానంగా ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు తద్వారా వచ్చే మెరుగైన అవకాశాలను కల్పిస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు.ఈ వర్క్ షాప్‌లో పాల్గొనే గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు సుల్తానాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులందరూ కంప్యూటర్ లాబ్‌ను ఉపయోగించుకొని ప్రాక్టీస్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల నుండి ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ డిపార్ట్మెంట్ హెడ్ గద్దం లక్ష్మి, మంచిర్యాల నెక్సా ఏఐ రా టెక్ సర్వీసెస్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఏ. సదానందం, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసే కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ డాక్టర్ తోట సతీష్ రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొని విద్యార్థులకు సంబంధిత అంశాలలో ఇన్పుట్ అందించారు. మూడు రోజుల ఈ కార్యక్రమానికి లెఫ్టినెంట్ బి.తిరుపతి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ వి.నరేష్, డాక్టర్ ఏ.ప్రవంతి, వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివ రావు, డాక్టర్ జి.సుబ్బారావు, ఎంజేపీఎస్ నుంచి శర్వాణి, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు..**

**- నగర మేయర్ మహంకాళి స్వామి..**

**గోదావరిఖని, జనంసాక్షి:**



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతు న్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.వార్డు సందర్శనలో భాగంగా మంగళవారం 35వ డివిజన్ సప్తగిరికాలనీ, రాజ్యాలక్ష్మీకాలనీ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ జంగపల్లి రమాదేవి శ్రీనివాస్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె.అరుణశ్రీతో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా చేపట్టిన కాలువల్లో పూడికతీత, పిచ్చి చెట్ల తొలగింపు తదితర పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వర్షాకాలంలో ఈ డివిజన్ వరద ముంపుకు గురయ్యేదని , రాజ్‌ఠాకూర్ ఎంఎల్ఏగా ఎన్నికైన తరువాత ఇచ్చిన హామీ మేరకు కాంక్రీట్‌తో వరద కాలువ నిర్మాణం చేపట్టడంతో సమస్య తీరిందని అన్నారు.రాజ్యాలక్ష్మీకాలనీలో త్వరలోనే ప్రధాన రోడ్డు కూడా నిర్మించి బురద సమస్య తీరుస్తామని అన్నారు.డివిజన్‌లో ఉన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని రెండు నెలల కాలంలోనే రెండవసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని అన్నారు. మెడికల్ కాలేజీకి వచ్చే రోడ్డు కూడా కోతకుగురవుతూ ప్రమాదకరంగా తయారైనందున తగు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు.ప్రధాన రహదారి ప్రక్కగుండా ప్రవహిస్తున్న వరద కాలువ నిర్మాణం కూడా త్వరలో చేపట్టడం జరుగుతుందని అన్నారు.నగరపాలక సంస్థ డిఇఇ శ్రీకాంత్ , టిపిఒ నవీన్, జూనియర్ అసిస్టెంట్ నాయిని చంద్రారెడ్డి, వార్డ్ ఆఫీసర్ శ్రావణి, నాయకులు గద్దం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు కూలీ రేట్లు పెంచకుండా బద్నాం చేయడం మానుకోవాలి..

**- రైతులను, ఆసాములను రెచ్చగొడుతున్న హోల్‌సేల్ వ్యాపారులు..**

**- గోదావరిఖని మార్కెట్ అధ్యక్షులు ఎంఎ గౌస్..**

గోదావరిఖని, జనంసాక్షి:

స్థానిక కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీరేట్లు పెంచాలని అడిగితే రేట్లు పెంచకుండా హోల్‌సేల్ వ్యాపారులు రైతులను, ఆసాములను రెచ్చగొడుతూ హమాలీలను బద్నాం చేస్తున్నారని, హోల్ సేల్ వ్యాపారులు తమ తప్పుడు విధానాలను మానుకొని కూలీరేట్లు పెంచాలని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ గోదావరిఖని కూరగాయల మార్కెట్ అధ్యక్షులు ఎం ఎ గౌస్ పేర్కొన్నారు.మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నలభై ఏళ్లుగా కూరగాయల మార్కెట్‌లో హమాలీలకు కూలీరేట్లు పెంపు విషయంలో, ఇతర సమస్యలపై హోల్‌సేల్ వ్యాపారులతో చర్చించి నిర్ణయం తీసుకునే విధానం ఉందని, ఈ నిర్ణయం ప్రకారం కూలీరేట్లు పెంచకపోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.ఇప్పుడు ఉన్న కూలీరేట్లు పెరిగిన ధరలకు అనుగుణంగా లేవని, 2019లో పెంచిన కూలీరేట్లు అమలు చేయడం వల్ల సరిపోక కూలీ రేట్లు పెంచాలని గత ఐదు సంవత్సరాలుగా హోల్‌సేల్ వ్యాపారుల కు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇంత వరకు కూలీరేట్లు పెంచకుండా, హోల్‌సేల్ వ్యాపారులు హమాలీలపై ఆసాములతో రైతులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ తప్పుడు విధానాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.హమాలీలు రైతుల వద్ద కూరగాయలు ఎత్తుకు పోతున్నారని ఆరోపించడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు.

హోల్ సేల్ వ్యాపారులు తమ తప్పుడు విధానాలను మానుకొని కూలీరేట్లు పెంచాలని లేకుంటే కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీమియా, గాలిపెల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణను పరిశీలించిన సోమారపు లావణ్య..

**గోదావరిఖని, జనంసాక్షి:**

బీజేపీ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో మండల ప్రవాస్ పర్యాటనలో భాగంగా మంగళవారం లక్ష్మీనగర్ మండలంలోని బూత్‌లను బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య పర్యవేక్షించారు.ఈ సందర్భంగా రామగుండం సర్ జాయింట్ కో-ఆర్డినేటర్ కోడూరి రమేష్,మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో 112 బీఎల్ఏ-2 కోడూరి రమేష్,113 బీఎల్ఏ-2 అంబాటి తిరుపతి,114 బీఎల్ఏ-2 సిలరపు కళ్యాణ్ 119 బీఎల్ఏ-2 కంది రాజేందర్,120 బీఎల్ఏ-2 మధరబోయిన రాకేష్,121 బీఎల్ఏ-2 సుల్వా లక్ష్మి నర్సన్న, 122 బీఎల్ఏ-2 కొమ్మల స్వామి, 123 బీఎల్ఏ-2 కుక్కడపు మురళి,124 బీఎల్ఏ-2 ఊరగొండ అపర్ణ,129 బీఎల్ఏ-2 గుడూరి నరేష్, 130 బీఎల్ఏ-2 మదగోయిన కార్తిక్,148 బీఎల్ఏ-2 పల్లికొండ సాగరిక,149 బీఎల్ఏ-2 పెద్దపల్లి రవీందర్,150 బీఎల్ఏ-2 మడికొండ శ్రీనివాస్, 151 బీఎల్ఏ-2 జంధ్యాల ప్రసాద్,224 బీఎల్ఏ-2 అన్నారాపు మౌనిక,225 బీఎల్ఏ-2 అన్నరపు కళ్యాణి,అశోకనగర్, అడ్డగుంటపల్లి,లక్ష్మీనగర్ తదితర బూత్‌లలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించి, ఓటరు నమోదు,సవరణ ప్రక్రియను సమీక్షించారు.స్థానిక బీఎల్ఓలను నేరుగా ప్రశంసించారు.పార్టీ నాయకులు మణికొండ శ్రీను,మాధవగోయిన రాకేష్, సుల్వ పద్మ, అరిగెల్ల ప్రవణ్, పాశం రాజు, కొమ్ము శ్రీనివాస్, కె.మురళి.,జి.భాస్కర్,జనగామ సాగర్ ,మెరుగు శ్రీను,కోమల స్వామి,కుమారస్వామి,కార్యకర్తలు తదితర్లు పాల్గొన్నారు,పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సోమారపు లావణ్య సూచించారు.